


'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో



అనంతసాగరం జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం నుంచి సోమశిలకు వస్తున్న వరద ప్రవాహం బుధవారం నాటికి పెరిగింది. మంగళవారం 3,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా బుధవారం 5,054 క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 27.520 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 4,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కరేడుపై గరం.. గరం

ఎమ్మెల్సీ తూమాటి వ్యాఖ్యలపై మంత్రి ఆనం సహా ఎమ్మెల్యేల అసహనం



ఇండోసోల్ సోలార్ పరిశ్రమకు ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో చేపడుతున్న భూసేకరణ ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కోరారు. దీంతో కలెక్టర్ 4800 ఎకరాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చామని, ఆ మేరకే ముందుకెళతామని, ఇళ్లు, పొలాలు కోల్పోయే వారికి ఎటువంటి అన్యాయం జరగదని వివరించారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ ఈ విషయంలో రాజకీయాలు చేయవద్దని సూచించారు. గత ప్రభుత్వంలో చేవూరు, రావూరు రైతులకు తక్కువ పరిహారం ఖరారు చేయగా, తాము అధికారంలోకి వచ్చాక ఆ మొత్తాన్ని పెంచామని గుర్తు చేశారు. అయితే ఆ తర్వాత కూడా మరోసారి ఎమ్మెల్సీ మాధవరావు ఇదే విషయంపై మాట్లాడారు. అప్పుడు మంత్రి ఆనం వారించారు. జిల్లా అభివృద్ధిపై సమీక్ష జరుగుతున్నప్పుడు పదే పదే ఒకే విషయంపై మాట్లాడడం మంచిది కాదని హితవుపలికారు. అయినా మాధవరావు వినిపించుకోకపోవడంతో ఎమ్మెల్యే ఇంటూరికి ఎమ్మెల్సీకి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి కూడా సీరియస్ అయ్యారు. ప్రభుత్వ జీవోపై చర్చించాలనుకుంటే అసెంబ్లీకి రావాలని మంత్రులు ఫరూక్, ఆనంలు మాధవ్‌కు సూచించారు. ఆ వెంటనే మాధవరావు డీఆర్సీ నుంచి వెళ్లిపోయారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతి, డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, విజయడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







జీవోపై చర్చించాలంటే అసెంబ్లీకి రావాలంటూ ఎమ్మెల్సీ తూమాటిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్

కరేడు భూ సేకరణపై ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ఎమ్మెల్యే ఇంటూరి మధ్య వాగ్వాదం

రైతు ప్రయోజనాలే ముఖ్యం

- సోమశిలకు నీటి విడుదల పెరుగుతుంది
- సర్వేపల్లి రిజర్వాయర్‌కు ఇబ్బంది లేకుండా చూడాలి
- డీఆర్సీలో ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, ఆనం, పక్కన మరో మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతు ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి ముఖ్యమని, ఆ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి సోమశిల డ్యాంకు నీటి విడుదల పెరుగుతుందని ఆయన తెలిపారు. ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశం బుధవారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ఫరూక్‌తోపాటు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, పీ4 కార్యక్రమం అమలు గురించి కలెక్టర్ ఆనంద్ వివరించారు. అజెండా ప్రకారం 18 ప్రధాన శాఖలపై డీఆర్సీలో సమీక్షించాల్సి ఉన్నప్పటికీ సమయం సరిపోకవడంతో కేవలం వ్యవసాయ, ఇరిగేషన్, హౌసింగ్ శాఖలపై మాత్రమే సమీక్ష జరిగింది. ఈ మూడు శాఖలపై లోతుగా సమీక్షించిన సభ్యులు.. కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడు తూ యూరియా కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వరదలొస్తే సర్వేపల్లి రిజర్వాయర్‌కు ప్రమాదమని ఇరిగేషన్ అధికారులు నివేదించగా, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పేదల ఇళ్ల స్థలాలు, ఇళ్ల విషయంలో ఎమ్మెల్యేల సూచనలు పరిగణలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. పీ4 పథకం ద్వారా మార్గదర్శకులను పేదల ఇళ్ల నిర్మాణంలో భాగస్వామ్యం చేసే ఆలోచన చేయాలని మంత్రి సూచించారు.

ఇక ఒకేసారి గ్యాస్ సబ్సిడీ నగదు జమ : నారాయణ

యూరియా కొరత సృష్టిస్తే క్రిమినల్ కేసులు : కలెక్టర్

మానటరింగ్ చేసి నీరు తెచ్చుకోవాలి : సోమిరెడ్డి

రాళ్లపాడుకు 1.5 టీఎంసీల నీరు ఇవ్వండి : ఇంటూరి

8

'అన్నదాత సుఖీభవ'కు 1,98,514 కుటుంబాలు అర్హత

- ఎన్‌పీసీఐ లింకు లేనివారు 2,520
- బ్యాంకు ఖాతాకు మ్యాపింగ్ కానివారు 4,389
- జాబితాలో పేరులేనివారు ఆర్ఎస్‌కేలను సంప్రదించాలి : డీఏవో

నెల్లూరు(వ్యవసాయం), జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికిగాను 1,98,514 కుటుంబాలు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించాయని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) పీ.సత్యవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో ఈకేవైసీ పూర్తయి బ్యాంకుకు, ఆధార్‌కు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)కి 2,540 మంది ఇన్‌యాక్టివ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాకు మ్యాపింగ్ కానివారు 4,389 మంది ఉన్నారని ఆమె తెలిపారు. వీరంతా వారి ఆధార్‌ను బ్యాంకులో ఎన్‌పీసీఐకి లింకు చేసుకుంటేనే పథకానికి అర్హులవుతారని తెలిపారు. రైతులు తమ పొలంలోపాటు బ్యాంకు ఖాతాకు ఆధార్‌లింకు అయిఉండాలని, అలాగే ఎన్‌పీసీఐ కూడా మ్యాపింగ్ అయిండేటట్లు చూసుకోవాలని వివరించారు. అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను రైతే సేవా కేంద్రా(ఆర్ఎస్‌కే)ల్లో అందుబాటులో ఉంచామని ఆమె తెలిపారు. ఇకపోతే ఈకేవైసీ పూర్తయిందా.. లేదా..? అన్న విషయాన్ని నిర్ధారించుకునేందుకు రైతులు మన మిత్ర వాట్సాప్ నంబరు 955230009లో చెక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. చనిపోయినవారి వారసులు ల్యాండ్ మ్యుటేషన్ చేయించుకున్నాక అర్హులవుతాయని తెలిపారు. ఆధార్ రాంగ్ మ్యాపింగ్ అయినవారు తహసీల్దారు కార్యాలయంలో సరిచేసుకోవాలని, సిటిజన్‌షిప్, ఫ్యామిలీ సర్వే సక్రమంగా చేయించుకున్నవారు మాత్రమే పథకానికి అర్హులని తెలిపారు. అనర్హులయినవారు అందుకు గల కారణాలను తెలుసుకుని, సరిచేయించుకుంటే గ్రీవెన్స్ ద్వారా తిరిగి అర్హులవుతారని తెలిపారు. అప్పటి వరకు ఈప్రక్రియ కొనసాగుతుందని, రైతులు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు ఆర్ఎస్‌కేల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

సడలని ఉద్యమం

డీఆర్సీలోకి వెళ్లేందుకు పారిశుధ్య కార్మికుల యత్నం
అడ్డుకున్న పోలీసులు, స్వల్ప ఉద్రిక్తత



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నెల్లూరు(సిటీ), జూలై 23,(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య విభాగాల్లో ప్రైవేట్ కార్మికుల ప్రమేయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, ఇంజనీరింగ్‌లోని పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పక్కనే జడ్పీలో జరుగుతున్న డీఆర్సీ సమావేశంలోకి అనుమతించాలని, అక్కడున్న మంత్రులకు తమ ఆవేదన చెప్పుకునేందుకు వీలు కల్పించాలని ర్యాలీగా బయలుదేరారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం జరిగి, తోపులాటకు దారితీసింది. స్వల్ప ఉద్రిక్తత తలెత్తడంతో సీఐటీయూ నేత పెంచల నరసయ్యతోపాటు కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని వేదాయపాళెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం కార్మికులంతా రోడ్డుపైనే నిరసనకు దిగారు. తమ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా లోపలకు వెళ్లేందుకు కొందరికే అవకాశం ఇచ్చిన పోలీసులు, వారిని మంత్రులు నారాయణ, ఆనం వద్దకు తీసుకెళ్లారు. వారికి కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందచేశారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని తెలిపారని కార్మికులు వెల్లడించారు. కాగా పోలీసులు అదుపులోకి తీసుకున్న నాయకులు, కార్మికులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

జడ్పీ కార్యాలయం వద్ద సీఐటీయూ నేతను జీపు ఎక్కిస్తున్న పోలీసులు



కౌలు రైతుకు సీసీఆర్‌సీ దక్కేనా..?

- ఈఏడాది 38వేల కార్డుల లక్ష్యం
- అపోహలతో ముందుకు రాని భూ యజమానులు
- పథకాలు దక్కాలంటే ఆ కార్డు తప్పనిసరి

కౌలు రైతులు బ్యాంకు రుణాలు తీసుకోవాలన్నా.. ప్రభుత్వాలు ఇచ్చే పెట్టుబడి సాయం పొందాలన్నా.. రాయితీపై విత్తనాలు, ఎరువులు అందాలన్నా... విపత్తుల సమయంలో పరిహారం దక్కాలన్నా... చివరికి చేతికొచ్చిన పంట అమ్ముకోవాలన్నా... పంట సాగు హక్కు కార్డు(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్ (సీసీఆర్‌సీ)) ఎంతో ముఖ్యం. అయితే ఆ కార్డు దక్కాలంటే భూయజమాని అంగీకారం తప్పనిసరి. కానీ కొందరు యజమానులు అపోహలతో అంగీకారం తెలుపడం లేదు. ఫలితంగా కౌలు రైతులు పథకాలకు దూరమై... ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

- వివరాలు 8లో..



మళ్లీ పెళ్లి సందడి

రేపటి నుంచి శ్రావణ మాసం • ఆలయాల్లో ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢంతో నెల రోజులుగా వెలవెలబోతున్న కల్యాణ మండపాలు మళ్లీ కళకళలాడనున్నాయి. శుక్రవారం నుంచి శ్రావణ మాసం మొదలవుతోంది. వివాహాలు, గృహ ప్రవేశాలు, నూతన వ్యాపారాలు, ఇతర శుభకార్యాలకు ఈ మాసం శ్రేష్టమైంది. ఈ ఏడాది శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఈ నెల 26, 27, 30, 31, ఆగస్టు 1, 3, 4, 5, 6, 7, 8, 9, 10, 11, 13, 14, 17, 18 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ముహూర్తాల్లో వివాహాల జరిపించడానికి వధూవరుల తల్లిదండ్రులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

• ఆలయాల్లో ప్రత్యేక పూజలు

శ్రావణ మాసం సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. ముఖ్యంగా అమ్మవారి ఆలయాల్లో ప్రతీ శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు, పల్లకీ సేవలు, మంగళవారాల్లో కాత్యాయనీ వ్రతాలు జరగనున్నాయి. ఇక, ఆగస్టు 8వ తేదీ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సామూహిక పూజలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే, ఆగస్టు 9వ తేదీ శ్రావణ (రాఖీ) పౌర్ణమి, 16వ తేదీ కృష్ణాష్టమి, 23వ తేదీ పోలాల అమావాస్య పండుగలు జరుపుకోనున్నారు.

26న విచారణకు రావాలని
మాజీ మంత్రి అనిల్‌కు నోటీసులు

నెల్లూరు (క్రైమ్) : మాజీ మంత్రి, వైసీపీ నేత అనిల్‌కుమార్ యాదవ్‌కు కోవూరు పోలీసులు బుధవారం రాత్రి నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫిర్యాదుతో కోవూరు పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు కోవూరు సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అనిల్‌కు కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. నోటీసును అందించేందుకు ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ నగరంలోని ఇస్కాన్ సిటీలో ఉన్న అనిల్ కుమార్ ఇంటికి వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. దీంతో ఆ నోటీసును ఇంటి గోడకు అంటించి వచ్చారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 23 (ఆంధ్ర జ్యోతి) : నిరుద్యోగులకు జిల్లా ఉపాధి కార్యాల యంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం విజయ్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సంస్థ తరారె గ్లోబల్ సొల్యూషన్స్ నిర్వాహకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటారన్నారు. టెలీ కాలర్స్, ఫార్మసిస్ట్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజ ర్స్, సేల్స్ ఎగ్జి క్యూటివ్స్, స్టోర్స్ మేనేజర్స్ తదితర పోస్టులు భర్తీ చేస్తారని పేర్కొన్నారు. పదవ తర గతి నుంచి ఏదైనా డిగ్రీ, ఫార్మసీ విద్యార్హతలు క లిగిన వారు పాల్గొన వచ్చన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు మేళా ప్రారంభమవుతుం దని, 18 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సైన్స్ అధికారి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూలై 23 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని చెముడుగుంటలో ఉన్న సైన్స్ ప్రదర్శనశాలలో సైన్స్ అధికారిగా డిప్యుటేషన్ పై పనిచేసేందుకు అర్హులైన సైన్స్ ఉపాధ్యా యులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ సర్‌ప్లస్‌గా ఉన్న క్లస్టర్ ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 26లోగా తమ దరఖాస్తును డీఈవో కార్యాల యంలో అందచేయాలని తెలిపారు.



'వీవో' తళుకులు.. పూజిత మెరుపులు

'హరిహర వీరమల్లు' సినిమా ఫేమ్ పూజిత పొన్నాడ నెల్లూరులో బుధవారం మెరిసింది. నగరంలోని బిన్నీ మొబైల్స్ సంస్థలో వీవో కొత్త ఫోన్లను ఆవిష్కరించిన ఆమె కాసేపు అభిమానులతో ముచ్చటించారు.

8 లో..

తాగునీటి ప్రాజెక్టులకు రూ.120 కోట్ల మంజూరు

డిసెంబరు కల్లా సంగం నుంచి నగరంలో ప్రతి ఇంటికి మంచినీరు

నెల్లూరులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

8

నేడు పార్లపల్లికి ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

పొదలకూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆయన సతీమణి సోమిరెడ్డి శృతిరెడ్డి గురువారం పొదలకూరు మండలం పార్లపల్లిలో నిర్వహించబోయే 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొంటారని గ్రామ టీడీపీ నాయకులు తెలిపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9661
వెండి కిలో ధర	రూ. 119300
వెండి ఒక గ్రాము	రూ. 122.30

సాగునీటి సరఫరా.. సాంకేతిక విజ్ఞానమే ఆసరా!

● సకాలంలో రైతులకు సాగునీరు





కెమెరా ద్వారా చానల్ స్లూయిజ్ పరిశీలన, వల్లూరు కాలువలో గుర్రపుడెక్కను తొలగిస్తున్న కార్మికులు

ముత్తుకూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకుని ఓ రైతు సాగునీటిని సకాలంలో సరఫరా చేస్తున్నారు. ముత్తుకూరు మండలంలోని పంటపాలెం సాగునీటి సంఘం అధ్యక్షుడు మునుకూరు మురళీధర్‌రెడ్డి చేపట్టిన ఈ వినూత్న ప్రయోగం సత్ఫలితాలను ఇస్తోంది. పంటపాలెం సాగునీటి సంఘం పరిధిలో వల్లూరు, పంటపాలెం, నారికేళపల్లి చెరువులు ఉన్నాయి. ఈ చెరువులన్నింటికీ వల్లూరు సప్లై ఛానల్ ద్వారా మూడు కాలువల నుంచి సాగునీరు చేరుతుంది. సాగునీటి సంఘం పరిధిలో దాదాపు 15 వేల ఎకరాలు సాగు అవుతుండగా, ఈ సీజన్‌లో దాదాపు 8 ఎకరాలు సాగు చేస్తున్నారు. కృష్ణపట్నం కాలువ నుంచి వల్లూరు సప్లై ఛానల్ ద్వారా పరిమితంగా సాగునీరు అందుతుంది. ఈ పరిస్థితుల్లో వల్లూరు కాలువ స్లూయిజ్ వద్ద మూడు కాలువలకు తగిన రీతిలో సాగునీటిని పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఆయా చెరువుల పరిధిలోని రైతులు తమకు సాగునీరు అందడంలేదన్న కారణంతో ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు సాగునీటిని వదులుకుంటున్నారు. దీంతో ఆయా గ్రామాల రైతుల మధ్య తరచూ వివాదాలు రేకెత్తుతున్నాయి. ఈ పరిస్థితులన్నీ తన దృష్టికి రావడంతో పంటపాలెం సాగునీటి అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి పరిష్కార మార్గంగా సాంకేతిక విజ్ఞానాన్ని చక్కగా వినియోగించుకుంటున్నారు. ఈదులవారిపాలెం సమీపంలో వల్లూరు సప్లై ఛానల్ లూయిస్ వద్ద తన సొంత ఖర్చులతో అధునాతన సోలార్ సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. కెమెరా ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తూ మూడు కాలువలకు సాగునీరు సరఫరాను చేస్తున్నారు. ప్రధానమైన వల్లూరు చెరువుకు సాగునీరు అందేలా వల్లూరు కాలువలో తీగపాచి గుర్రపుడెక్క పేరుకుపోవడంతో తమకు చెరువుకు నీరు అందడం లేదని, కాలువకు మరమ్మతులు చేయించాలని రైతులు మురళీధర్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

రైతన్నల మేలు కోరే సొంత ఖర్చులతో పనులు...

ప్రస్తుతం నిధులు లేకపోవడంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆదేశాల మేరకు సాగునీటి సంఘం అధ్యక్షులు మురళీధర్‌రెడ్డి సొంత ఖర్చులతో కాలువలో గుర్రపుడెక్క, తీగపాచిని తొలగించారు. సాగునీటి సంఘం సభ్యులు నర్సారెడ్డి, శ్రీధర్, వేణుల సహకారంతో రైతులకు సకాలం లో సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు. తమ సాగునీటి సంఘం పరిధిలో రైతులు సాగునీటికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా వ్యవసాయం చేసుకోవాలన్నది తమ లక్ష్యమని మురళీధర్‌రెడ్డి తెలిపారు.

వీఎస్‌యూలో పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ

వెంకటాచలం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీలోని పరీక్షా కేంద్రాన్ని బుధవారం వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు తనిఖీ చేశారు. పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాల్ టికెట్లను తనిఖీ చేసి, పరీక్షా కేంద్రాల్లో వసతుల గురించి విద్యార్థులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను వీసీ ఆదేశించారు. వీసీ వెంట వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ తదితరులు ఉన్నారు.

'హరిహర వీరమల్లు' షోను వీక్షించిన నేతలు

పొదలకూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జమున థియేటర్లలో బుధవారం రాత్రి హరిహర వీరమల్లు చిత్రాన్ని కూటమి నాయకులు వీక్షించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా జనసేన నాయకులు నారదాసు రవి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణా సంచా పేల్చారు. కథానాయకుడు పవన్ కళ్యాణ్ వెండితెరపై అద్భుతాన్ని సృష్టించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నారదాసు రవి, విష్ణు, టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్ బాబు, మల్లికార్జునాయుడు తదితరులు పాల్గొన్నారు.



గిరిజనుల నిరసన

రాపూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవట్లేదని బుధవారం ఖాళీ బిందెలతో గిరిజనులు సబ్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆంజనేయపురంలో రెండు వారాల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి గిరిజనులు అవస్థలు పడుతున్నారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో సబ్‌స్టేషన్ వద్ద ఖాళీ నీటిబిందెలతో మహిళలు ధర్నాకు దిగారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఇంటింటా సంక్షేమం.. ఊరూరా అభివృద్ధి!

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

ఇందుకూరుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంటికి సంక్షేమం, ప్రతీ గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగం గా మైపాడు (కృష్ణాపురం), కొరుటూరు (కొల్లి మిట్టపాలెం), సోమరాజుపల్లి, మొత్తలు గ్రామా లలో గురువారం ఆమె పర్యటించారు. సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పేదల సొంతింటి కల సాకారం చేస్తామన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పెన్షన్ పెంపు, దీపం 2, మత్స్యకార సేవలో, తల్లికి వందనం మొదలైన సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయడం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్ర నాయుడు, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, ఏకొల్లు పవన్‌కుమార్ రెడ్డి, చెంచు కిషోర్ యాదవ్, పీఎల్ రావు, చంద్రమోహన్ రెడ్డి, ఈదూరు చెన్నయ్య, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గాదెలదిన్నెలో ఉద్రిక్తత

● టీడీపీ, వైసీపీ, అధికారుల మధ్య వాగ్వాదం



అధికారులను ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకుడు దిలీప్

విడవలూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గాదెలదిన్నె గ్రామంలో చేపట్టిన మురుగు కాలువ నిర్మాణంలో టీడీపీ, వైసీపీ, నాయకులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల మధ్య బుధవారం రగడ జరిగింది. గాదెలదిన్నె గ్రామంలో వైసీపీ నాయకులు 15 ఆర్థిక సంఘం నిధుల కింద సుమారు 4లక్షలతో స్థానిక జడ్పీటీసీ ఇంటి వద్ద ఇదివరకు ఉన్న కాలువను ధ్వంసం చేసి మళ్లీ కాలువ నిర్మాణాన్ని చేపట్టారు. కాలువలోని మురుగు నీరు ఇరిగేషన్ కాలువలోకి కలపటానికి రంగం సిద్ధం చేశారు. ఈ విషయంపై స్థానిక టీడీపీ నాయకుడు దిలీప్ జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు రెడ్డి, ఏఈ జగదీష్‌లు కాలువ పనులను పరిశీలించారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న టీడీపీ నాయకుడు దిలీప్, శంభయ్య, మరికొందరు కలిసి అధికారులతో వాగ్వాదానికి దిగారు. పలు కాలనీల్లో మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని, అక్కడ కాలువ నిర్మిస్తే ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేదని, మురుగు నీరు ఇరిగేషన్ కాలువలో కలపవద్దని అధికారులకు తెలిపారు. మురుగునీరు పంట చేలలోకి వస్తే ఇబ్బందికరంగా మారుతుందని టీడీపీ నాయకులు అధికారులతో చెప్పారు. ఇంతలో వైసీపీ నాయకులు అక్కడికి చేరుకుని అధికారులకు వంత పాడటంతో కాసేపు తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. దీంతో ఆ ప్రాంతం కేకలతో దద్దరిల్లిపోయింది. ఈ నేపథ్యంలో మురుగు కాలువ పనులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని డీఈ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

గురుకుల పాఠశాలలో బాలిక అదృశ్యం?

సాయంత్రానికి హాస్టల్లో ప్రత్యక్షం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రభావతిమండలంలోని రామచంద్రాపురం గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ బాలిక బుధవారం వేకువజామున అదృశ్యమైన సంఘటన కలకలం రేపింది. దీంతో గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపల్, సిబ్బంది, సహ విద్యార్థులు అన్నిచోట్ల గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ప్రిన్సిపల్ వసుధ, వెంటనే బాలిక తల్లిదండ్రులతో పాటు సంక్షేమశాఖ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే సాయంత్రానికి బాలిక హాస్టల్లోని ఓ టెర్రస్‌లో ప్రత్యక్షమైంది. వెంటనే బాలికను గురుకుల కళాశాల ప్రిన్సిపల్, సంక్షేమశాఖ జిల్లా కో ఆర్డినేటర్ ప్రభావతి, సీఐ శ్రీనివాసులు రెడ్డి తహసీల్దారు వద్ద హాజరుపరిచారు. ఎట్టకేలకు బాలికను తల్లిదండ్రులకు అప్పజెప్పడంతో అధికారులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఎంపిక

వెంకటాచలం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చవట పాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయం విద్యార్థులు సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఎంవీ కుముద తెలిపారు. పాఠశాలలో బుధవారం జరిగిన అభి నందన కార్యక్రమంలో ఎంపికైన వి ద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ జూలై 27 నుంచి 30వ తేదీ వరకు తమిళ నాడులో జరిగే సీబీఎస్‌బీ సౌత్‌జోన్ చెస్ ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీలకు తమ పాఠశాల నుంచి నిశాంత్, ప్రదీప్, ఈషిత్ నాయన్, అబ్దుల్ కలాం మంచి ప్రతిభ కనబరచడంతో ఎంపికయ్యారన్నారు.

పార్వతీదేవికి సారె సమర్పణ

రాపూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమరసత సేవా విభాగం ఆధ్వర్యంలో ఆషాడ మాసం సందర్భంగా బుధవారం శివాలయంలోని పార్వతీదేవికి మహిళలు సారె సమర్పించారు. స్థానిక వరసిద్ధి వినాయక దేవస్థానంలో ప్రత్యేక పూజల అనంతరం చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన మహిళలు పార్వతీదేవికి ఆషాడం సారెను సమర్పించారు. మహిళలందరికీ తిరుగు సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

యానాదులను ఇబ్బంది పెట్టొద్దు

సైదాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): యానాదులను ఇబ్బంది పెట్టొద్దని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెసీ పెంచయ్య డిమాండ్ చేశారు. బుధవారం కమ్మవారిపల్లి యానాదులతో కలసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందజేశారు. యానాదులు సాగు చేసుకుంటున్న భూముల జోలికి వస్తే ఆత్మహత్యలే శరణ్యమని విన్నవించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లిఖార్జున రావు, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

రాపూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మద్దెలమడుగు జంక్షన్ నుంచి నెల్లూరు వెళ్లే దారిలో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టాలని తహసీల్దారుకు విన్నవించారు.

జొన్నవాడ మీదుగా నెల్లూరుకు మరో ఆర్టీసీ బస్సు



నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం, పెనుబల్లి, జొన్నవాడ మీదుగా నెల్లూరు వరకు మరో కొత్త ఆర్టీసీ బస్సు నడవనుంది. ఈ మేరకు బుధవారం జొన్నవాడలో కొత్త బస్సును ఆత్మకూరు డిపో మేనేజరు శివకేశవ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. జొన్నవాడ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, జొన్నవాడ, పెనుబల్లి, సాల్మానుపురం, కాశయకాగొల్లు, శ్రీరంగ రాజపురం, నెల్లూరు రూరల్ కొడ్లపూడి నుంచి పెనుబల్లిలోని జడ్పీ హైస్కూల్ కు వెళ్లే విద్యార్థులు, చిరుద్యోగులు, వ్యాపారస్థుల సౌకర్యార్థం బస్సును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కోసూరు గోపి, హెచ్‌ఎం అనంతకృష్ణ, ఎంపీటీసీ వినయ్ నారాయణ, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పల మహేంద్ర, ఉమ్మయ్యస్వామి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిదినాలను కల్పించాలి

విడవలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని దినా లు కల్పించాలని ఎంపీడీవో నగేష్ కుమారి తెలిపారు. విడవలూరులో బుధవారం జరి గిన ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. మస్టర్లని తనిఖీ చేశారు.

ప్రత్యర్థి వర్గంపై దౌర్జన్యం.. పలువురి అరెస్టు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పోలినాయుడు చెరువు గ్రామంలో సుమారు 3 నెలల క్రితం జరిగిన హత్య కేసులో ముద్దాయిల బంధువులపై హతుల బంధువులు దాడులకు దిగుతూ ఇబ్బందులకు గురిచేస్తుండంతో కేసు నమోదు చేశారు. ఇద్దరు యువకులు, ఆరుమంది మహిళలపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

పోలీసు అధికారి పేరు చెప్పి రూ. 50 వేలు వసూలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) బుచ్చి పోలీసులు 'వేస్టేజ్' వసూల్ రాజాలుగా తయారయ్యారు. బుధవారం వేకువజామున బుచ్చిరెడ్డిపాళెం కనిగిరి రిజర్వాయర్ దగ్గర్నుంచి సదరన్‌ఛానల్ మీదుగా సంగం మండల పరిధిలోని అరవపాళెం వద్ద చేపల గుంతల్లో వేస్టేజ్ వాహనాన్ని అన్‌లోడ్ చేసేందుకు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఓ కానిస్టేబుల్ అక్కడికి వెళ్ళి వాహనాన్ని అడుకున్నారు. పోలీసు అధికారి సమాచారంతో వచ్చానంటూ వేస్టేజ్ వాహన దారుడినుంచి రూ.50వేలు వసూలు చేసుకుని మరో రూ.15 వేలు కూడా ఇన్ఫార్మర్‌కు ఇప్పించాడు. ఈ విషయం వాహనం డ్రైవర్ బట్టబయలు చేయడంతో విషయం అధికారులకు తెలిసి ఆ కానిస్టేబుల్‌పై చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు రిపోర్టు పంపించినట్లు సీఐ శ్రీనివాసులు రెడ్డి చెప్పారు.

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ముత్తుకూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక పాధాన్యత ఇస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. మల్లూరు గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి జ్యోత్స్నారాణి, వ్యవసాయ విస్తరణాధికారి గోవర్ధన్, రైతులు పాల్గొన్నారు.

కోవూరు : సాగు చేసే పంట వివరాలను రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులచే నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి టీ రజని కోరారు. పాటూరు గ్రామ పొలిమేరల్లోని పొలంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీపీఏలు చందన, ప్రభ పాల్గొన్నారు.

విడవలూరు : వేరుశనగ పంటలో మొక్కకూ మొక్కకూ మధ్య దూరం ఉండేలా నాటుకుంటే మంచి దిగుబడులు వస్తాయని పొదలకూరు, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రసన్న రాజేష్, సురేఖ, హసీనాబానులు తెలిపారు. రామతీర్థం, గౌరీపురం గ్రామాల్లో బుధవారం జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ అనిత, వ్యవసాయాధికారి లక్ష్మీ, వీఏఏ ప్రవీణ్, చెంచులక్ష్మి, ప్రత్యూష పాల్గొన్నారు.

కొడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతులకు పెద్దపీట వేసిందని టీడీపీ సీనియర్ నాయకుడు బాలశేఖర్ పేర్కొన్నారు. దామేగుంట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు వ్యవసాయ శాఖాధికారిణి విజయలక్ష్మి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నక్కల రవి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

స్నేహితుడే హంతకుడు

● జగనన్న కాలనీలో హత్య కేసు ఛేదించిన పోలీసులు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు (క్రైం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడే కాలయము డిగా మారి హత్య చేసిన ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నగరంలోని భగత్ సింగ్ కాలనీలోని జగన న్న కాలనీలో ఈనెల 18న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడి వివరాలను బుధవారం నవాబుపేట పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. జగనన్న కాలనీలో మణి, కుమారి దంపతులు ఉంటున్నారు. వారికి కుమార్తె, కుమారుడు వంశీకృష్ణ(26) ఉన్నారు. వంశీకృష్ణ క్యాటరింగ్ పనులు చేసేవాడు. ఈ నెల 18న మణి ఇంట్లో ఉండగా, ఆయన భార్య కిసాన్‌నగర్‌లోని కుమార్తె ఇంటికి వెళ్లారు. అదే రోజురాత్రి వంశీకృష్ణ దారుణహత్యకు గురయ్యాడు. ఈనెల 19న ఉదయం వంశీకృష్ణకు తల్లి ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో తల్లి, కుమార్తె ఇంటికి వచ్చారు. ఇంట్లో కుమారుడు రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉండటంతో కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ జీ. వేణుగోపాల రెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈనెల మంగళవారం సాయంత్రం ప్రశాంతినగర్ వద్ద కిసాన్‌నగర్‌కు చెందిన మల్లు సుధీర్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. మృతుడు వంశీకృష్ణ, సుధీర్ స్నేహితులు. వారు చెడు వ్యసనాలకు బానిసై తిరుగుతూ ఉంటారు. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో స్నేహితుడు ఇంట్లో లేని సమయంలో అతడి ఇంట్లోని వస్తువులను వంశీకృష్ణ ధ్వంసం చేశాడు. ఎందుకు చేశావని సుధీర్ ఫోన్‌లో ప్రశ్నించగా వంశీకృష్ణ దుర్భాషలాడారు. దీంతో కక్ష పెంచుకున్న సుధీర్, ఎలాగైనా వంశీకృష్ణను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 18న అర్ధరాత్రి వంశీకృష్ణ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని తెలుసుకొని సుధీర్ అక్కడకు వెళ్లాడు. నిద్రిస్తున్న వంశీకృష్ణపై నీళ్ల మోటర్‌తో ముఖంపై దాడిచేసి పరారయ్యాడు. పోలీసులు సాంకేతిక ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేశారు. హత్యకు వినియోగించిన నీళ్ల మోటర్, చాకును స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. త్వరిత గతిన కేసును ఛేదించిన నవాబుపేట ఇన్‌స్పెక్టర్ జీ. వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐలు రహమాన్, శివయ్య, సిబ్బంది ఎస్ఐ ప్రసాద్, ఆర్‌వీ రత్నయ్య, ఎం వేణు, జీ. మస్తానయ్య, షేక్ గౌస్‌బాషాలను ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అభినందించారు.

బైక్, ఆటో ఢీ : యువకుడి మృతి



మృతి చెందిన గణేష్

వెంకటాచలం (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం సమీపం లోని జగనన్న కాలనీ వద్ద జాతీయ రహదారి పై బుధవారం మోటర్ బైక్, ఆటో ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన గణేష్, దినేష్, అభిలాష్ కలిసి బైక్‌పై పెళ్లి బట్టలు కొనేందుకు నెల్లూరుకు బయలుదేరారు. వెంకటాచలం దాటిన తర్వాత జగనన్న కాలనీ వద్ద ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆటో బైక్‌కు తగిలింది. దీంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గణేష్ (35) తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ దినేష్, అభిలాష్‌లను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● ఆగిఉన్న లారీని ఢీకొని..



మృతి చెందిన ఉస్మాన్‌షరీఫ్

దగదర్తి(బిట్రగుంట), జూలై 23(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం ఉలవపాళ్ల సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని మైపాడ్‌గేట్ ప్రాంతానికి చెందిన షేక్. ఉస్మాన్‌షరీఫ్ (28) తన స్నేహితుడు గణేష్‌తో కలిసి మోటారు సైకిల్‌పై కావలి వైపు వెళుతున్నారు. మార్గమధ్యంలో ఉలవపాళ్ల సమీపంలో పెట్రోల్ బంకు దాటిన తరువాత మరమ్మతులకు గురై రహదారిపై ఆగిఉన్న లారీని గమనించకుండా మోటారు సైకిల్‌తో వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఉస్మాన్‌షరీఫ్ అక్కడికక్కడే మృతి చెం దాడు. గణేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఉస్మాన్‌షరీఫ్ మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా గణేశ్‌ది బోగోలు మండలం నాగులవరంగా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ జంపాని కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యర్రబొట్లపల్లిలో అక్రమ మైనింగ్ సీజ్

● ఎక్స్‌కవేటర్ స్వాధీనం



మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు కోటేశ్వరరావు, ఎస్ఐ మాల్యాద్రి, తదితరులు

కొండాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట పంచాయతీ ఎర్రబొట్లపల్లిలో అక్రమ మైనింగ్ జరుగుతుండగా మంగళవారం రాత్రి గ్రామస్థులు అడ్డుకొని 100కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం తహసీల్దారు కోటేశ్వరావు, ఎస్ఐ మాల్యాద్రి, వీఆర్‌వో కొండయ్య అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. గత కొంతకాలంగా యర్రబొట్లపల్లి గ్రామ సరిహద్దులోని ప్రభుత్వ భూమిలో రాత్రి వేళల్లో బాంబులు పేల్చుతూ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి అధికారులు వెళ్లేసరికి అక్కడ ఉన్న వ్యక్తులు పారిపోయారు. దీంతో బాంబులు ఏర్పాటు చేసి ఉంటారని బాంబు స్క్వాడ్‌ను పిలిపించి పరిశీలించగా బాంబులు లేవని తేల్చారు. అక్కడ ఉన్న వైర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వ్యక్తులను గుర్తించి కేసు నమోదు చేస్తామని తహసీల్దారు కోటేశ్వరావు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 505



ఇరగాళమ్మ గుడిలో శ్రావణ మాసోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా గ్రామదేవత ఇరుగాళమ్మ ఆలయంలో ఉత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రతీ శుక్రవారం సామూహిక కుంకుమార్చన జరుగుతుందని అర్చకులు తెలిపారు. ఆగస్టు 8, 15న నిర్వహించే పుష్పయాగానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గిరికృష్ణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా : ఎంహెచ్‌వో



నెల్లూరు రూరల్, జూలై 23,(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజల సహకారంతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంహెచ్‌వో కనకాద్రి తెలిపారు. బుధవారం డాక్టర్ చైతన్య నుంచి బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడారు. చెత్త సేకరణకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా నగరాన్ని సుందరంగా మార్చేందుకు శక్తి వంచనలేకుండా పనిచేస్తానన్నారు. మున్సిపల్ మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిల పూర్తి సహకారం తీసుకుని, అటు నెల్లూరు సిటీ, ఇటు రూరల్ నియోజకవర్గాలను చెత్తరహితంగా తయారు చేస్తామన్నారు. కార్పొరేషన్‌లోని అన్నీ విభాగాల అధికారులతో సమన్వయంతో పని చేస్తామన్నారు. కమిషనర్ నందన్ సూచనలకు అనుగుణంగా ఆరోగ్య విభాగాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కుల వివరాలు ఇవ్వండి

● రాజ్యసభలో ఎంపీ బీద

నెల్లూరు(వ్యవసాయం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కుల స్థితిగతులపై రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు రాజ్యసభలో బుధవారం వివరణ కోరారు. నిర్మాణ ఖర్చులు, వ్యాపారం, ఉపాధి కల్పన తదితర అంశాలపై ప్రశ్నించారు. ఏపీలో 2022-23లో అందించిన ప్రతిపాదనలకు అనుగుణంగా బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం పరిసవరిపాళెంలో 280 ఎకరాల భూమిలో పార్కు నిర్మాణం మంజూరైందని మత్స్య, పశుసంవర్థక, డెయిరీ శాఖల సహాయమంత్రి జార్జ్ కురియన్ సమాధానమిచ్చారు. రూ.88.08కోట్లతో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుందని, ఇందులో కేంద్రం వాటా కింద రూ.52.85కోట్లు, రాష్ట్రం వాటా రూ.35.23కోట్లుగా ఉందని చెప్పారు. సముద్రపు మొక్కల పార్కు, చేపల, రొయ్యల, పీతల విభాగాలతోపాటు ఆహార ప్రాసెసింగ్, అలంకార చేపల సాంకేతిక కేంద్రం ఈపార్క్‌లో ఉంటాయని మంత్రి వివరించారు.

లార్వా దశలోనే దోమలను నివారించాలి



నిల్వ నీటిని ఒలకబోయిస్తున్న సిబ్బంది

నెల్లూరు (వైద్యం) జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జ్వరాల బారిన పడకుండా లార్వా దశలోనే దోమలను నివారించాలని జిల్లా సహాయక మలేరియా అధికారి నాగార్జునరావు తెలిపారు. బుధవారం వేదాయపాళెం సీహెచ్‌సీ పరిధిలో డెంగ్యూ మాసోత్సవాలు జరిగాయి. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాల బారిన పడకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఇళ్లలో నీటినిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉందని, వాటిపై ప్రజలు దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ల రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ నవీన్‌కుమార్‌తో కలిసి డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం అధికారి శ్యాంసన్‌బాబు, ఆరోగ్య సహాయకులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

స్టీలు సీసాల పంపిణీ



నీళ్ల సీసాలను అందచేస్తున్న సుబ్బారావు

నెల్లూరు(విద్య), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్ట నగరపాలకోన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ ఎం.సుబ్బారావు మంచినీటి కోసం స్టీలు సీసాలను పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులు మంచినీరు తాగేందుకు ఇబ్బందులు పడకుండా తమ వంతు సాయంగా సీసాలను అందచేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే. కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు జయలక్ష్మి, దీప్తి, గీత, సుజావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పండుగ అయిపోయి పక్షం..
చెత్తకు కలగని మోక్షం !

రొట్టెల పండుగ జరిగిన బారాషహీద్ దర్గా వద్ద వ్యర్థాల గుట్ట

నగరంలోని బారా షహీద్ దర్గాలో ఈనెల 6వతేదీ నుంచి ఐదురోజులపాటు రొట్టెల పండుగ నిర్వహించారు. దేశ,విదేశాల నుంచి లక్షలాదిమంది భక్తులు వచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది అహోరాత్రులు పనిచేసి పండుగను విజయవంతం చేశారు. అంతా బాగానే ఉంది... పండగ అయిపోయి పక్షం రోజులు కావస్తోంది. దర్గా ఎదుట, పరిసరాల్లోనూ చెత్తాచెదారం అలాగే ఉండిపోయింది. పండుగకు ముందు 10 రోజుల నుంచి శ్రమించిన నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది భక్తులకు పారిశుధ్య సమస్య లేకుండా చేశారు. పండుగ తరువాత కూడా వారు రెండు రోజులు శ్రమించి ఉంటే ఈ చెత్త సమస్య ఉండేదికాదు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు శ్రద్ధ పెట్టి చెత్తాచెదారాన్ని శుభ్రం చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు







దసరా నుంచి యంత్రాలతో రోడ్ల క్లీనింగ్



షటిల్ ఆడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), జూలై 23,(ఆంధ్రజ్యోతి): విజయదశమి నుంచి నగరంలోని రోడ్లను యంత్రాలతో శుభ్రం చేయిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. బుధవారం 9వ డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలో ఆధునీకరించిన పార్కును, 13వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ త్వరలో నగరాన్ని దోమల రహితంగా తయారు చేయబోతున్నట్లు ప్రకటించారు. అండర్‌గ్రౌండ్ ద్వారా మురుగు బయటకు వెళ్లే ప్రక్రియను కూడా అందుబాటులోకి తీసు కురానున్నామన్నారు. ఇందులో భాగంగా యూజీడీ పనులకు సీఎం చంద్రబా బు రూ.165 కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు. రియల్ ఎస్టేట్ వారు వెంచర్లు నిర్మిస్తే అందులో 10 శాతం పార్కుకు కచ్చితంగా కేటాయించాలని స్పష్టం చేశారు. తన నలభై ఏళ్ల రాజకీయ చరిత్రలో నారాయణవంటి నాయ కుడిని చూడలేదని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, టీడీపీ నాయకు రాళ్ల తాళ్ళపాక అను రాధ, విజేతారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన

వింజమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో లెక్కలవారిపాలెం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్, పశు గణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని డిప్యూటీ డైరెక్టర్ మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాడి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఖనిజ లవణాలు కలిగిన దాణా ఇవ్వడం వలన ఆరోగ్యవంతమైన లేగదూడలు పుడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వింజమూరు ఏడీఏ రఘునాథ్, ఆత్మకూరు ఏడీఏ వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులు, కృష్ణయ్య, వీర శేఖర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించండి

● నగర మేయర్ స్రవంతి



వ్యాపారులతో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(సిటీ), జూలై 23,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని శెట్టిగుంటరోడ్డు వద్ద ఉన్న చేపలమార్కెట్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎన్ఎంసీ మేయర్ స్రవంతి కోరారు. బుధవారం కార్పొరేటర్ మస్తానమ్మతో కలిసి మార్కెట్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మార్కెట్లో నీటిసౌకర్యం కల్పించాలని, షెడ్ నిర్మించాలని అధికారులకు సూచించారు. ర్యాంపు, గేట్ వంటివి త్వరలో ఏర్పాటు చేయిస్తామన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. కాగా కారొరేషన్‌లో జరిగిన పీ 4 కార్యక్రమంలో కమిషనర్ నందన్ మాట్లాడారు. అనంతరం ఎన్జీవోలతో కలిసి బ్రోచర్లు విడుదల చేశారు. అంతకుముందు ఆర్ఎస్ఆర్ స్కూల్ వద్ద ఆక్రమణలను ఆయన పరిశీలించారు. ఆయన ఆదేశాలనుసారం సిటీప్లానింగ్ అధికారులు మురుగు కాలువపై అక్రమ నిర్మాణాలను కూల్చేశారు.

కరేడులో బలవంతపు భూసేకరణ ఆపేయాలి



మాట్లాడుతున్న పులిగండ్ల శ్రీరాములు తదితరులు

నెల్లూరు (వైద్యం) జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీ కోసం జిల్లాలోని కరేడు గ్రామంలో చేపట్టిన బలవంతపు భూసేకరణను నిలిపేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు, జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య విలేకరులతో మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం సెక్షన్ 10 ప్రకారం వివిధ పంటలు పండే భూములను పరిశ్రమల కోసం చేపట్టరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని ఉల్లంఘించి, కార్పొరేట్ సంస్థలకు భూములు కట్టబెట్టడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో కరేడులో భూసేకరణ నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ మాస్టర్స్ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నృత్య ప్రదర్శనలో బాలికలు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పురమందిరంలో బుధవారం రాత్రి జిల్లా డాన్సు మాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా నటరాజ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా సాయి, కార్యదర్శిగా చంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఇబ్రహీం, జాయింట్ కార్యదర్శులుగా మాధవ్, మధులతోపాటు ఈసీ మెంబర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ టీ. వేణుగోపాల్, జల్లి పద్మాకర్, చలువాది జితేంద్ర, పాతూరు సాయి, పేడూరి ప్రదీప్ పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అనంతరం సీనియర్ డ్యాన్స్ మాస్టర్లను సత్కరించారు. డ్యాన్సు మాస్టర్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ప్రత్యేక నృత్య ప్రదర్శనలు అలరించాయి.

క్యారీ బ్యాగులకు నగుదు వసూలు చేయకూడదు

● ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి వర్మ సమాధానం



కేంద్రమంత్రి ధర్మేంద్రను సత్కరిస్తున్న వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం) జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఉత్తర్వుల ప్రకారం వినియోగదారుల నుంచి క్యారీ బ్యాగులకు డబ్బు వసూలు చేయ కూడదని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ స్పష్టం చేశా రు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి పైవిధంగా సమాధానం ఇచ్చారు. క్యారీ బ్యాగులకు డబ్బు వసూలు చేయడం వినియోగదారుల రక్షణ చట్టం -2019 ప్రకారం అన్యాయమైన వాణిజ్య పద్ధతికి సమానమని పేర్కొన్నారు.

● నెల్లూరులో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని ఎంపీ వేమిరెడ్డి కేంద్ర మంత్రి మాండవీయను బుధవారం మరోసారి కలిశారు. హాస్పిటల్, క్వార్టర్స్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

● నెల్లూరులోని కొత్తూరు సమీపంలో ఉన్న కేంద్రీయ విద్యాలయానికి ఎన్‌సీసీ యూనిట్ మంజూరు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎంపీ వేమిరెడ్డి కోరారు. ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. 700 మంది విద్యార్థులు చదువుతున్న కేంద్రీయ విద్యాలయానికి ఎన్‌సీసీ యూనిట్‌ను అందించాల్సిన అవసరం ఉందన్నారు.

రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం

నెల్లూరురూరల్, జూలై 23,(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపనున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితెలిపారు. మండలంలోని కొత్త, పాత వెల్లంటి గ్రామాల్లో బుధవారం ఎంపీపీ విజయకుమార్, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రా మాల్లో పలువురు రెవెన్యూ సమస్యల తో సతమతమవుతున్నారని, వాటి పరి ష్కారానికే ఈ సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ రెవెన్యూ శాఖకు చెందిన అధికారులంతా ఉంటారని, ఎవరైతే సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారో వారు లిఖిత పూర్వకంగా అర్జీలు సమర్పిస్తే వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతామన్నారు. అనంతరం పెద్దచెరుకూరు సిరిగార్డెన్స్‌లో సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలలో కార్పొరేటర్ రామ్మోహన్, టీడీపీ నాయకులు పోలూరు సుబ్బయ్య, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, మనుబోలు శ్రీధర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీకుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీలో చేరిక

నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో 24వ డివిజన్‌కి చెందిన వైసీపీ నాయకులు మాల్యాద్రిరెడ్డి, మాలకొండారెడ్డి, భాస్కర్ తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ముసునూరులో బంగారం చోరీ

కావలి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరులో పల్లపు మాల్యాద్రి ఇంట్లో చోరీ జరిగిన విషయం బుధవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. మాల్యాద్రి భార్యకు ఆరోగ్యం సరిలేక పోవడంతో చికిత్స నిమిత్తం ఈనెల 18న ఇంటికి తాళం వేసి నెల్లూరుకు వెళ్లి అక్కడే ఉన్నారు. పనిమనిషి బుధవారం వచ్చి చూసేసరికి ఇంటి తలుపుల తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి మల్యాద్రికి సమాచారం ఇచ్చింది. ఆయన వచ్చి పరిశీలించగా బీరువాలోని సుమారు 20 సవర్ల బంగారం చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్టీసీ బస్టాండులో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో సురేష్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో బాలాజీ ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సెల్‌ఫోన్లతోపాటు ఎలక్ట్రానిక్ పరికరాలను విక్రయిస్తున్న బాలాజీ ఫౌండేషన్ వారు ప్రయాణికులకు తాగునీరు అందించడం ప్రశంసనీయమన్నారు. బీన్యూ బాలాజీ సంస్థ సీఈవో సాయి నిఖిలేష్ మాట్లాడుతూ తన తండ్రి బాలాజీ చౌదరి నెల్లూరు నుంచే వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించారన్నారు. నెల్లూరుతో తమకు ఎంతో అనుబంధం ఉందని, ఇలాంటి ప్రాంతంలో తమ ఫౌండేషన్ సేవలు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీన్యూ మొబైల్స్ ఈడీ సాయి నితీష్, బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ మధుసూదన్‌రెడ్డి, ప్రజా రవాణా అధికారి షమీమ్, మేనేజర్లు మురళి, దివ్య కామాక్షి, తదితరులు పాల్గన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి అభిషేకాలు



మూలస్థానేశ్వరాలయంలో చిన్నరథంపై ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్ కృష్ణమందిరంలో గల శంకరస్వామి ఆల యంలో బుధవారం రాత్రి మాసశివరాత్రి అభిషేకాలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. కార్యక్రమానికి ఉభ యకర్తలుగా బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణి, మల్లీశ్వరి వ్యవహరించారు. కార్యక్రమాలను అర్చకులు బీ.శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● ఆదిశంకర ధ్యానమందిరంలో..

పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో బుధవారం మాసశివరాత్రి సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. పవని అనీల్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు విశేష పుష్పాలం కారాలు, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మం దిరం కమిటీ నూతన అధ్యక్షుడు జీ రామసుబ్రహ్మ ణ్య శర్మ, ఉపాధ్యక్షురాలు జీ ప్రత్యూషశర్మ, కమిటీ సభ్యులు శ్రీహరిప్రసాద్‌రావు, గన్నవరం ప్రభాకర్ శర్మ, తంగిరాల వెంకట శ్రీకాంత్‌శర్మ పాల్గొన్నారు.

● నేడు హోమాలు

కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలోని మహా మృత్యుంజయేశ్వరాలయంలో ఆషాఢ అమావాస్య సందర్భంగా గురువారం ఉదయం 9గంటలకు గణపతి నవగ్రహ, రుద్ర, దుర్గాదేవి హోమాలు జరుగుతాయని నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులంతా తరలిరావాలని కోరారు.

● ఘనంగా మాస శివరాత్రి

మూలస్థానేశ్వరాలయంలో మాస శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా రుద్రాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి చిన్నరథంపై శివపార్వతులకు ప్రాకారోత్సవం జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

నెల్లూరురూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు మాదరాజుగూడూరులో ఘన సన్మానం లభించింది. బుధవారం స్థానిక సచివాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులను శాలువ, జ్ఞాపికలతో ఎంపీపీ బూడిద విజయకుమార్, సర్పంచి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి గున్నయ్య తదితరులు ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడంలో వారి పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు.



ఆకలి ఫీట్లు...!!



సైకిల్ చక్రంలో కాళ్ళుపెట్టి తాడుమీద నడుస్తున్నమహిళ



నోట్లో పెట్రోల్ పోసుకుని ఊదడంతో పెద్దఎత్తున రేగిన మంటలు

ఆకలి.. పేదవాడిని ప్రేమించే అనార్కలి!. అందుకేనేమో.. ఆ పేద కుటుంబాన్ని ఆకలి రాకాసి వెంటాడుతోంది. ఇంటిల్లిపాది చేత 'సర్కస్ ఫీట్లు' చేయిస్తోంది. రోడ్డు పక్కన.. మురికి కాల్వల చెంతన.. గుడారాలు వేసుకుని పిల్లా పాపలతో అత్యంత దయనీయంగా బతుకు సమరం సాగించే 'సంచార' జీవితాలు వాళ్లవి. మూడు పూటలా... ఐదు వేళ్లనూ నోట్లోకి పంపడం కోసం గాల్లో నిర్భయంగా పల్టీలు కొట్టే 'సాహసాల రాకెట్లు' వాళ్లు!. ఏ ఊరికెళితే.. అదే.. వాళ్ల చిరునామా.

ఈ ఒక్క పూటకు మాత్రం.. బుచ్చిరెడ్డిపాళెంలోని ఆ ప్రైవేటు పాఠశాలే.. వాళ్ల కడుపు నింపే 'అన్నదాన' కేంద్రమైంది. ఒళ్లు గగుర్పొడిచే ఆ విన్యాసాలు.. అక్కడి ఉపాధ్యాయులతోపాటు పిల్లల చేత కన్నీళ్లు పెట్టించాయి. చూసిన ప్రతి ఒక్కరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. కర్రను పది నిముషాల పాటు పళ్ళపై నిలబెట్టే నైపుణ్యం... ఇరవై అడుగుల ఎత్తుండే రెండు కర్రలకు తాడు కట్టి.. చేతిలో ఇరవై అడుగుల కర్రను పట్టుకుని ముందుకు వెనక్కి నడిచే ఓ మహిళ సాహసం... సైకిల్ చక్రంలో కాళ్ళుపెట్టి దారంపైన నడిచే కళ.. గుడ్డతో చుట్టిన కాగడాకు నిప్పు పెట్టి.. ఆ మంటను చేతులపైన.. ముఖంపైన అద్దుకునే ఓ యువకుడి ధైర్యం.. నోట్లో పెట్రోలు పోసుకుని... మంటలపై ఊదే గుండె ధైర్యం... నిజంగా.. ఆ సంచార జాతి బిడ్డల సొంతం! మనం వాళ్లకు ఇప్పుడు చెప్పాల్సింది 'హ్యాట్సాఫ్' కాదు... చేయాల్సింది శెల్యూటూ కాదు. కానీ.. ప్రభుత్వాలైనా.. పాలకులైనా.. బాధ్యత కలిగిన పౌరులెవరైనా.. తప్పకుండా చూపించాల్సిన 'మానవీయ' ధర్మం మాత్రం ఒకటుంది.. అదే.. ఆ ఇంటిల్లిపాదికీ కొన్ని నెలల పాటు కడుపు నింపే 'ఉపాధి' మార్గం! మనసున్న దాతృత్వం. అదే.. మనుషులుగా మన అసలైన కర్తవ్యం.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



డీఆర్సీ సమావేశంలో ముచ్చటించుకుంటున్న మంత్రులు ఫరూక్, ఆనం

డీఆర్సీలో ఎవరేమన్నారంటే..

నెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు తమ ప్రాంత సమస్యలపై సమావేశంలో ప్రస్తావించారు.

కౌలు రైతుకు

సీసీఆర్‌సీ దక్కేనా?

- ఈ ఏడాది 38వేల కార్డుల లక్ష్యం
- అపోహలతో ముందుకు రాని భూ యజమానులు
- పథకాలు దక్కాలంటే ఆ కార్డు తప్పనిసరి
- కొందరు ససేమిరా...

నెల్లూరు(వ్యవసాయం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న కౌలు రైతులకు పంట చేతికొచ్చినా లాభం మాత్రం ఉండడం లేదు. ఫలసాయం అమ్ముకున్న తర్వాత అప్పులు తీర్చేస్తే చాలనుకునే పరిస్థితిలో ఉన్నారు. దీనికితోడు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయంతోపాటు ఇతర రాయితీ పథకాల లబ్ధి దక్కడం లేదు. ఈ నేపథ్యంలో కౌలు రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డులు అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈఏడాది 38వేల కార్డులు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే 3వేలకుపైగా కార్డులు మంజూరు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. 33వేల కార్డులు రెన్యువల్ చేసుకోవాల్సి ఉండగా మరో రెండు వేల వరకు ఇవ్వాల్సి ఉంది.



జిల్లాలో కౌలు రైతుకు జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డు

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీకి వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే కొంత మంది భూయజమానులు ఇందుకు అంగీకరించేందుకు ముందుకు రావడం లేదు. భూమిపై తమ హక్కు పోతుందని, ప్రభుత్వం నుంచి లభించే రాయితీలు, పథకాలు కోల్పోతామనే అపోహతోనే భూయజమానులు ఆసక్తి చూపడం లేదు. దీనిపై అధికారులు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

3,005 కార్డులిచ్చాం

జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి 38 వేల సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటి వరకు 3005 కార్డులు ఇచ్చి ఉన్నాం. 552 మంది కౌలు రైతులకు పంట రుణాలు కూడా ఇచ్చారు. దాదాపు 33వేల కార్డులు రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంది. సీసీఆర్‌సీతో ఎంతో ప్రయోజనం ఉంది. భూయజమానులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కువ మంది యజమానులు ఒప్పుకుంటున్నారు. కొంత మంది అపోహలతో ముందుకు రావడం లేదు.



- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి



ఔషధ నియంత్రణ చట్టాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, అసోసియేషన్ నేతలు

ఔషధ చట్టాలపై అవగాహన అవసరం

నెల్లూరు (వైద్యం) జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఔషధ చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్(డీసీఏ) పీ. రమేష్ తెలిపారు. బుధవారం నగరంలోని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఔషధ చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఎక్స్ ఔషధాలు, హయ్యర్ యాంటీబయాటిక్స్ వాడటం వల్ల భవిష్యత్తులో తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వైద్యుల సలహా లేకుండా వీటిని వాడకూడదని ఆయన చెప్పారు. మత్తు మందులు దుర్వినియోగం కాకుండా అందరూ జాగ్రత్తలు వహించాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఔషధ నియంత్రణ చట్టాలపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తి పవిత్ర, కావలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటకృష్ణ, సంతపేట సీఐ దశరథరామయ్య, నెల్లూరు కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకు కరేడు రైతులకు అండగా...

- బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

ఉలవపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : నా ప్రాణం ఉన్నంత వరకు కరేడు రైతులకు అండగా ఉంటానని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం కరేడు పంచాయతీ పరిధిలోని 16 శివారు గ్రామాల నుంచి కులమతాలకు అతీతంగా నాలుగు బస్సులు, కార్లలో పురుషులు, మహిళలు సుమారు 250 మంది రామచంద్ర యాదవ్ స్వగ్రామం చిత్తూరు జిల్లా పుంగనూరుకు వెళ్లి ఆయనను కలిసి కరేడు భూపోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కరేడు రైతులకు ప్రత్యక్షంగా మద్దతు తెలిపి వారి పోరాటంలో పాలుపంచుకున్నారని, కొందరు తెలియక చేసిన తప్పిదానికి గ్రామస్థులను మన్నించాలని కోరారు. దీంతో రామచంద్రయాదవ్ మాట్లాడుతూ తక్కువ సమయంలోనే కరేడు రైతులతో అనుబంధం ఏర్పడిందని, వారికి ఇష్టం లేకుండా ప్రభుత్వం, నాయకులు సెంటు భూమి కూడా తీసుకోకుండా ప్రత్యక్ష ఉద్యమంలో స్వయంగా పాల్గొంటానన్నారు. గ్రామస్థుల మధ్య ఐకమత్యాన్ని విడగొట్టి విడతల వారీగా భూములు కాజేయాలని కుట్ర చేస్తూ జిల్లా కలెక్టర్‌తో 4,800 ఎకరాల భూముల సేకరణపై జీవో ఇప్పించారన్నారు. అధికారులు, నాయకుల మాయమాటలకు ఎవరూ తలొగ్గదని, ముఖ్యంగా మత్స్యకారులతో కలిపి కలిసికట్టుగా పోరాడితేనే మీ భూములు కాపాడుకోగలరని, మీ పోరాటానికి నాప్రాణాలు అడ్డువేస్తానని ప్రమాణం చేశారు.



రామచంద్ర యాదవ్‌ను కలిసిన కరేడు రైతులు



టీడీపీ కార్యకర్తలకు చెక్కుల పంపిణీలో మంత్రి నారాయణ, రమాదేవి దంపతులు

తాగునీటి ప్రాజెక్టులకు

రూ.120 కోట్ల మంజూరు

- డిసెంబరు నాటికి ప్రతి ఇంటికి మంచినీరు
- సొంతనిధి ద్వారా కార్యకర్తలకు ఏటా రూ.10 కోట్లు
- పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు (వైద్యం) జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి ప్రాజెక్టుల కోసం రూ. 120 కోట్లు విడుదల అయ్యాయని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. బుధవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి 175 మంది కార్యకర్తలకు రూ. 45 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఇంటికి డిసెంబరు నాటికి సంగం నుంచి తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. డ్రైన్‌ల మరమ్మతులు, కొత్తడ్రైన్‌ల ఏర్పాటు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రూ. 50 కోట్లతో మేజర్ కెనాల్స్ రివిట్‌మెంట్ ప్రారంభించామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఆక్రమణదారులకు ఎవరూ వత్తాసు పలక వద్దని హితవు పలికారు. మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రానికి 5 స్వచ్ఛ అవార్డులు వచ్చాయంటే, అందుకు మంత్రి నారాయణే కారణమని తెలిపారు. నమ్ముకున్న కార్యకర్తలను ఆదుకునేందుకు మంత్రి నారాయణ ఏటా సొంత నిధులలో రూ.10 కోట్లు కేటాయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

నెల్లూరు (వైద్యం), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సెలక్షన్ కమిషన్ ద్వారా నియామకం జరిగి, 20 ఏళ్ల ఆరోగ్యసేవలు అందించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లో తీసుకోవాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హంస నాయకులు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందించారు. అనంతరం చేజర్ల మాట్లాడుతూ కోర్టు ఆదేశాలతో హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించటం వల్ల వారి ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నం అయ్యాయన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు అర్హతను బట్టి కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ఆఫీస్ సబార్డినేట్లుగా దీర్ఘకాలం పని చేస్తున్న వారికి ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలకు వేతనాలు అందేటట్లు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా కోశాధికారి శేషగిరి రావు, ఉపాధ్యక్షుడు మజాహర్, నాయకులు మురళీ, నాగరాజు, గౌస్‌బాషా, లక్ష్మీకాంతమ్మ, మంజరి పాల్గొన్నారు.

బోగోలు పంచాయతీ కార్యదర్శిపై విచారణ

బిట్రగుంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ జహీర్‌పై కావలి డీఎల్పీవో వెంకటరమణ బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బహిరంగ విచారణ చేపట్టారు. పంచాయతీలో పన్నుల వసూళ్లతోపాటు వివిధ ఖర్చులలో నగదు దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ఆ పంచాయతీ మాజీ ఉపసర్పంచు వీరరఘు జిల్లా కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్పీవో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సమాచార చట్టం ద్వారా పంచాయతీ కార్యదర్శి నుంచి తీసుకున్న పలు ఖర్చులపై వివరణ ఇవ్వాలని ఫిర్యాదుదారుడు కోరారు. వసూలు చేసిన పన్నులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు స్థానికుల సమక్షంలో రుజువు చేయించాలని డిమాండ్ చేశారు. పన్నుల పేరుతో కొందరి నుంచి ఎక్కువ మొత్తం సిబ్బంది ఫోన్‌పేకి వేయించి తరువాత తన ఫోన్‌పేకి బదిలీ చేయించుకున్నారని ఆరోపించారు.



బహిరంగ విచారణ చేస్తున్న డీఎల్పీవో వెంకటరమణ

ట్రాక్టర్‌కు రోజుకు రూ.1000 డీజిల్ ఖర్చు ఏవిధంగా అవుతుందని ప్రశ్నించారు. దీనికి సంబంధించిన అన్ని లెక్కలతో ఎంబుక్కులు సిద్ధంగా ఉన్నాయని కార్యదర్శి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ విచారణకు సంబంధించిన సమగ్ర నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తానని, వారి ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎల్పీవో కార్యాలయ ఏవో వెంకటసురేష్, జడ్పీటీసీ కీర్తన, వార్డు సభ్యులు, మాజీ సర్పంచు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో కరేడు యువకులు?

ఉలవపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం కేసులో కరేడు యువకులు ఇద్దరిని తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారన్నట్లు సమాచారం. సేకరించిన వివరాల మేరకు.. తిరుపతి జిల్లా వరదయ్యపాలెం వద్ద వారం రోజుల క్రితం పోలీసులు తనిఖీల్లో ఎర్రచందనం తరలిస్తున్న బొలేరో వాహనం పట్టుబడింది. ఆ వాహనాన్ని కరేడుకు చెందిన వినోద్‌రెడ్డి అనే యువకుడు నడుపుతూ పట్టుపడ్డాడు. దీంతో ఎర్రచందనం స్మగ్లింగ్‌లో కరేడుకు చెందిన వడ్రంగి కుటుంబానికి సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో ఆ కుటుంబంలోని ఓ యువతిని గత రెండు రోజులుగా ఉలవపాడు పోలీస్ స్టేషన్‌లో విచారించారు. ఈ క్రమంలో బుధవారం కరేడుకు చెందిన బడితల అశోక్, చింతం శ్రీహరిని తిరుపతి జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం అశోక్‌ను వదిలిపెట్టి శ్రీహరిని మాత్రం తిరుపతికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీనిపై పూర్తిస్థాయి సమాచారం చెప్పేందుకు స్థానిక పోలీసులు తమ పరిధిలోనిది కాదన్నట్లు వ్యవహరిస్తుండటం, బయట జిల్లా పోలీసులు వివరాలు చెప్పేందుకు నిరాకరించడంతో ఏం జరుగుతుందో తెలియడం లేదు.

మందులు తడిస్తే మాకేంటి ?

వర్షాలకు నెమ్ముతో పాడైపోతున్నాయ్



వర్షపునీటిలో తడుస్తూ వరండాలో ఉన్న మందుల పెట్టెలు

నెల్లూరు (వైద్యం) జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగా విలువైన మందులు వర్షాల పాలవుతున్నాయి. జిల్లాలోని 52 పీహెచ్‌సీలతోపాటు 29 సీహెచ్‌సీలకు సరఫరా చేయాల్సి మందులు డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరాయి. వీటిని అక్కడే భద్రపరిచి ఆయా ఆరోగ్య కేంద్రాలకు చేరవేస్తుంటారు. అయితే ఆయా మందులు, ఇంజక్షన్‌లు కార్యాలయం ఆవరణంలో ఉంచడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు అవి తడుస్తున్నాయి. మందులు దాచుకోటానికి వైద్య ఆరోగ్యశాఖలో గదుల కొరత ఉన్నా మొదటి, రెండవ అంతస్థుల్లోని వరండాల్లో వీటిని ఉంచవచ్చు. అయితే పై వరకు తీసుకు వెళ్లటానికి బద్ధకం కారణంగా మందులు తడుస్తున్నాయి.

నెల్లూరులో వీవో కొత్త ఫోన్ల ఆవిష్కరణ

- పాల్గొన్న నటి పూజిత పొన్నాడ

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సెల్‌ఫోన్ తయారీ సంస్థ వీవో నూతనంగా విడుదల చేసిన వీవో ఎక్స్ ఫోల్డ్ 5, వీవో ఎక్స్ 200 ఎఫ్ఈ మోడళ్లను నెల్లూరు మార్కెట్‌లోకి విడుదలయ్యాయి. 'హరిహర వీరమల్లు' సినిమా ఫేమ్ పూజిత పొన్నాడ, బీన్యూ మొబైల్స్ సంస్థ సీఈవో సాయి లిఖిలేష్, మేనేజింగ్ డైరెక్టర్ సాయినితీష్, వీవో జనరల్ మేనేజర్ అతిష్ భార్గవ, డిప్యూటీ జనరల్ మేనేజర్ రెడ్డి వసంత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త మోడళ్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్ పూజిత మాట్లాడుతూ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా వీవో సంస్థ వివిధ మోడళ్లను విడుదల చేయడం అభినందనీయమన్నారు. బీన్యూ సీఈవో సాయినిఖిలేష్ మాట్లాడుతూ నెల్లూరుకు బీన్యూ మొబైల్స్ సంస్థకు ఎంతో అనుబంధం ఉందన్నారు. తన తండ్రి బాలాజీ చౌదరి నెల్లూరు నుంచి వాచ్‌ల విక్రయంతో వ్యాపారాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 150 స్టోర్లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా లాప్‌టాప్, కూలర్స్, ఏసీలతోపాటు ఇతర ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. వీవో నూతన మోడళ్లను ప్రీబుక్ చేసుకున్న వినియోగదారులకు పూజిత పొన్నాడ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో బీన్యూ, బాలాజీ సంస్థ ఉద్యోగులు, వీవో సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ఇకపై ముందుగానే చెప్తారు



దీపం పథకం అర్హులైన మహిళలందరికీ ఉచితంగా సిలిండర్లు అందిస్తున్నాం. ఇందుకు సంబంధించిన సబ్సిడీ నగదును మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. అయితే ఈ విషయం కొంత మంది మహిళలకు తెలియడం లేదని చెబుతున్నారు. ఈ విషయాన్ని గత క్యాబినెట్ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు చర్చించారు. ఇకపై సబ్సిడీ డబ్బులు మొత్తాన్ని మహిళలందరి ఖాతాల్లో ఒకేసారి వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు డబ్బులు పడతాయన్నది ఇకపై ముందుగానే చెప్తారు.

- పొంగూరు నారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి

సభా మర్యాదలు పాటించాలి



నెల్లూరు డీఆర్సీ సమావేశాలు చాలా హుందాగా జరుగుతుంటాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ డీఆర్సీ అధ్యక్షుడు చెప్పినట్లుగానే సమావేశం నడుస్తుంది. కోపం, బాధ వచ్చినా అందరూ సభా మర్యాదలు పాటిస్తూ వచ్చేవారు. కానీ ఇప్పుడు ఆ సభా మర్యాదలు వదిలేసి తూమాటి మాధవరావు మాట్లాడటం సరైనది కాదు. మేము 40 ఏళ్లుగా అధ్యక్షులు చెప్పినట్లే నడుచుకుంటున్నాం. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరించడానికి ఇది డీఆర్సీ సమావేశం.. మరొకటి కాదు.

- ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ శాఖ మంత్రి

మానిటరింగ్‌తో నీరు తెచ్చుకోవాలి



కృష్ణా పరివాహకంలో వరదలు వస్తున్నాయి. పోతిరెడ్డిపాడు ద్వారా శ్రీశైలం నుంచి నీటిని సోమశిలకు తీసుకొచ్చేందుకు అవకాశం ఏర్పడింది. గతేడాది మానిటరింగ్ చేసి రెండు సీజన్లకు సరిపడేంత నీటిని తీసుకొచ్చాం. ఇప్పుడు కూడా అదే మాదిరిగా రెగ్యులర్‌గా మానిటరింగ్ చేసి రాబోయే సీజన్‌కు ఇబ్బంది లేకుండా నీటి నిల్వలు పెట్టుకోవాలి. కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వారం రోజులైనా ఎందుకు బాగు చేయలేకపోతున్నారు..? యూరియా కొరత రానీయకుండా చర్యలు తీసుకోవాలి.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

యూరియా కొరత సృష్టిస్తే కేసులు



ప్రభుత్వం నుంచి యూరియా సరఫరా విషయంలో ఎటువంటి సమస్య లేదు. నిబంధనల మేరకు రైతులకు యూరియాను అందిస్తున్నాం. మెట్ట ప్రాంతాల్లో జామాయిల్‌కు అవసరం లేకపోయినా రైతులు యూరియాను వేస్తుండడంతో సమస్య తలెత్తుతోంది. యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. యూరియాను అనధికారికంగా నిల్వ చేసినా, బ్లాక్ మార్కెట్లో ఎక్కువ ధరకు విక్రయించినా క్రిమినల్ కేసులు పెడతాం. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నాయి.

- ఓ ఆనంద్, జిల్లా కలెక్టర్

రాళ్లపాడుకు 1.50 టీఎంసీలివ్వాలి



అందరి సహకారంతో రాళ్లపాడు జలాశయం కింద గతేడాది పంటలు పండించగలిగాము. ఈ ఏడాది కూడా అలానే జరగాలని కోరుకుంటున్నాం. అయితే ఇంకా రాళ్లపాడు డీప్‌కట్ పూర్తి చేయలేదు. త్వరగా పూర్తి చేసి రాళ్లపాడుకు నికరంగా 1.50 టీఎంసీల నీరు ఇవ్వాలి. ఈ ప్రాజెక్టు వద్ద పర్యవేక్షణకు పది మంది ఏఈఈలు ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారు. వీరొక్కరు ఎలా పర్యవేక్షిస్తారు..? డిప్యుటేషన్‌పై సిబ్బందిని నియమించాలి. రాళ్లపాడు జలాశయం, కాలువల్లో పాత గేట్లను బాగు చేయాలి.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

సబ్ కెనాల్స్ పునరుద్ధరించాలి



మా నియోజకవర్గం ఇరిగేషన్ విషయంలో వివక్షకు గురైంది. పక్కనే కాలువల్లో నీరు పారుతున్నా ఆ నీటిని రైతులు ఉపయోగించుకోలేని దయనీయ పరిస్థితులు ఉన్నాయి. ఈ మెయిన్ కెనాల్స్ నుంచి గతంలో సబ్ కెనాల్స్ ఉండేవి. కానీ ఏ కారణాలతో ఆ సబ్ కెనాల్స్‌ను మూసేశారో తెలియదు. వెంటనే సబ్ కెనాల్స్‌ను పునరుద్ధరించాలి. గండిపాలెం జలాశయానికి హెడ్ ఆఫ్ అకౌంట్ కూడా లేదు. దీంతో చిన్న చిన్న పనులు కూడా చేయలేకపోతున్నారు. మెట్ట ప్రాంతాల్లో అగ్రికల్చరల్ అసిస్టెంట్ల కొరత లేకుండా చూడాలి.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే


యూరియా కొరతతో అవస్థలు



యూరియా కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా వారికి సరిపడా యూరియాను అందించాలి. సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా అన్నదాత సుఖీభవ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. పీఏసీఎస్‌ల ద్వారా గతంలో ధాన్యం కొనుగోళ్లు చేయగా, అందుకుగానూ ఇంత వరకూ కమీషన్లు ఇవ్వలేదు. దీని మూలంగా అక్కడ సిబ్బందికి జీతాలు ఇవ్వడం కూడా కష్టమైంది. కమీషన్లు చెల్లిస్తేనే వచ్చే సీజన్లో పీఏసీఎస్‌లలో ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందుల తలెత్తవు.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

ఈ-క్రాప్ చేయకపోతే ఎలా?



మరో నెల రోజుల్లో వరి కోతలు మొదలవుతాయి. కానీ ఇప్పటికీ మా నియోజకవర్గంలో ఈ-క్రాప్ నమోదు ప్రారంభం కాలేదు. సచివాలయాల్లో అగ్రికల్చరల్ అసిస్టెంట్ల కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించి త్వరగా పూర్తి చేయాలి. ధాన్యం ఏఏ కేంద్రాల్లో కొనుగోలు చేస్తారో ముందుగానే రైతులకు అవగాహన కల్పించాలి. ఇప్పటి నుంచే మిల్లర్లతో చర్చించి బీజీలు తీసుకోవాలి.

- దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే

ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలి

అనంతసాగరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు వైసీపీ నాయకులు మానుకోవాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శాఖమూరి సుబ్బారావు హితవు పలికారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ నేతలు క్యూఆర్ కోడ్ల పేరిట చేస్తున్న నిరసనలను ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను టీడీపీ నేరవేరుస్తోందని ఆయన స్పష్టం చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9661
వెండి కిలో ధర	రూ. 119300
వెండి ఒక గ్రాము	రూ. 122.30

తెలుగురాయపురం - కలువాయి రోడ్డుకు గండ్లు

● ఆందోళనలో గ్రామస్థులు


నూకనపల్లి వద్ద ఆర్అండ్బీ రోడ్డు కల్వర్టు వద్ద పడిన గండ్లు.

కలువాయి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలుగురాయపురం-కలువాయి ఆర్అండ్బీ రోడ్డుకు నూకనపల్లి సమీపంలోని స్లాబ్ కల్వర్టు వద్ద రోడ్డుకు ఇరువైపులా మట్టి కోతకు గురై గండ్లు పడడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తెలుగురాయపుం వద్ద పెన్నా నదిలో అక్రమ రీచ్ ఏర్పాటుచేసి భారీ వాహనాలతో ఇసుక తరలించారు. ఈవాహనాల దాటికి ఈమార్గంలో నూకనపల్లి వద్ద ఉన్న కల్వర్టు కూలిపోగా, తెలుగురాయపురం వద్ద ఉన్న వంతెన కూడా దెబ్బతింది. నూకనపల్లి వద్ద కల్వర్టు కూలిపోయి రాకపోకలు నిలిచిపోవడంతో ఆర్అండ్బీ అధికారులు అక్కడ ఇసుక వేసి తాత్కాలికంగా రాకపోకలు పునరుద్ధరించారు. కాగా, ఇటీవల ఒక మోస్తరు వర్షం కురవడంతో అక్కడ వేసిన ఇసుక కోతకు గురై రోడ్డుకు ఇరువైపులా గండ్లు పడ్డాయి. మరోసారి వర్షం కురిస్తే గండ్లు పడిన ప్రాంతంలో రోడ్డు పూర్తిగా దెబ్బతింటుంది. కలువాయి- చేజర్ల మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని గ్రామస్థులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం: ఆర్అండ్బీ ఏఈ

దెబ్బతిన్న కల్వర్టుల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని పనులు మంజూరు కాలేదని ఆర్అండ్బీ ఏఈ అవినాష్ తెలిపారు. రోడ్డు నిర్మాణానికి కూడా రూ.2.5కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇంకా టెండర్లు పిలవలేదన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా గంధ మహోత్సవం

● ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే కాకర్ల


దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నేతలు

ఉదయగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా వారి 220వ గంధమహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దర్గా కమిటీ చదివింపుల కార్యక్రమం చేపట్టారు. అనంతరం హక్కుదారుల ఇంటి నుంచి బాణసంచా పేలుళ్ల నడుమ గందాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని భక్తులకు పెంచిపెట్టారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత దర్గా కమిటీ ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికింది. భక్తుల సౌకర్యార్థం దర్గా కమిటీ అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా ఎడ్లబండ్ల ఊరేగింపు

సంగం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెక్‌పోస్టు కాలనీలో ఉన్న మాతా పరమేశ్వరి జాతర మహోత్సవంలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి ఎడ్లబండ్ల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎడ్లబండ్లను రంగురంగుల కాగితాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన


ఎంపీడీవో ఐజాక్‌కు సమస్యలు వివరిస్తున్న లబ్ధిదారులు

అనంతసాగరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సోమశిలలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఒక గుత్తేదారుకు ఇస్తే పూర్తిగా నిర్మించకుండా వదిలేసినట్లు ఎంపీడీవోకు వివరించారు. త్వరగా లబ్ధిదారులు ఇళ్ల కట్టుకుంటే బిల్లులు వచ్చేలా చూస్తామని ఆయన చెప్పారు. హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాసరావు

సీతారామపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడి అందరికీ ఆదర్శంగా నిలవాలని డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ రుణాలు, ఎంసిపి, హెచ్ఎల్‌పి పథకాలు, స్త్రీనిధి, ఉన్నతి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉదయగిరి వ్యవసాయ శాఖ ఏడి శశిధర్ పిఎంఈజీపి, పిఎం ఎఫ్ఎంఈ పథకాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సీసీలు శ్రీనివాసులు, చెన్నకేశవులు, కిష్టయ్య, మరియమ్మ, తిరుపాలు, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సైదులు

ఏఎస్ పేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎస్ఐ సైదులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలబాలికల చట్టాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరం


ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

వింజమూరు, జూలై 23 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు మండలంలో షెడ్యూల్డ్ తెగలందరికీ అందాలనే ఉద్దేశంతో వారికి ప్రత్యేకంగా ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే మండలంలో ఎంపిక చేసిన సచివాలయాల్లో ఈశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కల్వర్టు గుంతలో బైక్ బోల్తా

● యువకుడికి తీవ్ర గాయాలు

సంగం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మోటారు బైక్ అదుపుతప్పి కల్వర్ట్ గోతిలో పడి యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని కలిగిరి రహదారిలో ఆశ్రమ మలుపు వద్ద బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరుకు చెందిన పవన్‌కుమార్ అనే యువకుడు కలిగిరి వైపు నుంచి సంగం వైపు వేగంగా వస్తూ మార్గమధ్యంలో సంగం చెక్‌పోస్టుకు సమీపంలో ఆశ్రమం మలుపు వద్ద అదుపుతప్పి కల్వర్ట్ గోతిలో మోటారు బైక్‌తోపాటు పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అతడిని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్ఐ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ శిఖామణి మోటారుబైక్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన

వింజమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో లెక్కలవారిపాలెం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్, పశు గణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని డిప్యూటీ డైరెక్టర్ మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాడి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఖనిజ లవణాలు కలిగిన దాణా ఇవ్వడం వలన ఆరోగ్యవంతమైన లేగదూడలు పుడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వింజమూరు ఏడీఏ రఘునాద్, ఆత్మకూరు ఏడీఏ వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులు, కృష్ణయ్య, వీర శేఖర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు చేతి పుస్తకాల పంపిణీ

ఉదయగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా చేతి పుస్తకం రూపొందించింది. గతంలో ఎన్నడూలేని విధంగా ఎస్‌సీఈఆర్టీ సహకారంతో సమగ్రశిక్ష ద్వారా ముద్రించిన ఈ పుస్తకాలను ఉపాధ్యాయులకు పంపిణీ చేసేందుకు జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ కార్యాలయాలకు చేరాయి. ఈ పుస్తకాల్లో బోధనకు సంబంధించిన మెలకువలు, పాఠ్యాంశ ప్రణాళికలు తదితరాలు ముద్రించారు. సబ్జెక్టుల వారీగా ఈ పుస్తకాలను ముద్రించి ఉపాధ్యాయులకు పంపిణీ చేయనున్నారు. విద్యార్థులకు బోధించేందుకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

ఏఎస్ పేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని బుధవారం విఆర్ఏలు తహసీల్దారు అనిల్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గత వైసీపీ ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని, ఈ ప్రభుత్వం అయినా తమ సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. తమకు జీతాలు పెంచి, టిఏ, డిఏలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఏలు లచ్చయ్య, నారాయణ, సునీల్‌కుమార్, అంకమ్మ, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు జాగ్రత్తగా వ్యవహరించాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వైసీపీ కార్యకర్తలు గ్రామాల్లో జాగ్రత్తగా వ్యవహరిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించుకోవాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం వరికుంటపాడులో నిర్వహించిన చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వెంగమాంబపురంలో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న కార్యకర్త సీహెచ్ ఆవులయ్య నివాసానికి వెళ్లి పరామర్శించారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నేతలు, కార్యకర్తలు

ఆత్మకూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఆగస్టు 3 నుంచి మూడు రోజుల పాటు నెల్లూరు నగరంలో జరుగు 26వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పిలుపునిచ్చారు. ఆత్మకూరులో బుధవారం నియోజకవర్గ నాల్గవ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతు సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించనున్న మహాసభకు పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. అనంతరం ఆత్మకూరు నియోజకవర్గ సమితిని 17 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ కార్యదర్శిగా యామాల మధు, సభ్యులుగా జంగం నాగరాజు, బి హజరత్తయ్య, సుబ్బరాయుడు, నరసింహులు, మాలకొండయ్య తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పోకూరి మాలకొండయ్య, గిరిజనుల రాష్ట్ర సఘం నాయకులు, బిఎల్ శేఖర్ పాల్గొన్నారు.

సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

సీతారామపురం,జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషిచేయాలని మండల అధ్యక్షురాలు చింతంరెడ్డి పద్మావతి అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి మాట్లాడుతూ ఉపాధి హామి పథకం ద్వారా పేదలకు పనులు కల్పించాలని, వలసల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందని తెలిపారు. మూడునెలల కాలంలో వెలుగు, విద్యాశాఖ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, పారిశుధ్యం, హౌసింగ్ తదితర శాఖల్లో జరిగిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పాజీ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ శారమ్మ, ఎంపిటిసి పిసి అల్లూరు రాజు, ఎంఈవో మస్తాన్‌వలి, ఐసిడిఎస్ సూపర్వైజర్ షాను, సర్పంచ్‌లు భాగ్యకుమారి, వెంకటసుబ్బయ్య, రామచంద్ర, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బంది లక్ష్యాలను అధిగమించాలి : ఏపీడీ


ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ మృదుల

ఉదయగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలని ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ మృదుల పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి వారు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. క్లస్టర్ పరిధిలో 790 ఎకరాల పండ్లతోటల సాగు లక్ష్యం కాగా 249 ఎకరాల్లో సాగుకు అనుమతి వచ్చిందన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. ప్రతి రైతు తన పొలంలో ఫారంపాండ్ నిర్మించుకుంటే భూగర్భ జలాలు పెంపొందించుకోవచ్చన్నారు. మస్టర్లు ఫీల్డ్ అసిస్టెంట్ల వద్దనే ఉండాలని, ఇతరుల వద్ద ఉంటే చర్యలు తప్పవన్నారు. కార్యాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అజంఖాన్, ఈసీ తిరుపతిరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయాలి : ఏడీఏ


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీమాధవి

ఉదయగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగులో తగిన మెలకువలు వారికి అందజేయాలని ఏడీఏ జీ లక్ష్మీమాధవి సూచించారు. బుధవారం తన కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హులకు అందేలా చూడాలన్నారు. మట్టి నమూనాల వివరాలను రైతులకు అందజేయాలన్నారు. పచ్చిరొట్ట పైర్లు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు చెన్నారెడ్డి, కవిత, మాధవ్, సునీల్, ఏఈవోలు భోగ్యం సుధీర్‌కుమార్, వినోద్, సుస్మిత, సాంబశివయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


ఉదయగిరి: జొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో పెట్టుబడులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి విజయకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని బండగానిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసేవా కేంద్రంలో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం సాగులో ఉన్న సజ్జ పంటను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈకార్యక్రమంలో వీఏఏ మేడం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి చినబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●అనంతసాగరం: మండలంలోని బొమ్మవరంలో సాగులో ఉన్న బొప్పాయి పంటను అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్ల వ్యాప్తి, నివారణ, అధిక దిగుబడుల కోసం తీసుకోవల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాధికారి శైలజాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మొక్కలు ఉచితంగా అందించడంతో పాటు ఏడాదికి ఎరువుల ఖర్చుల కోసం రూ. 2,100 ప్రభుత్వం అందచేస్తుందని హార్టికల్చర్ అధికారి రాజశేఖర్ తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

స్నేహితుడే హంతకుడు

● జగనన్న కాలనీలో హత్య కేసు ఛేదించిన పోలీసులు


నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఇన్‌స్పెక్టర్


నెల్లూరు (క్రైం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడే కాలయముడిగా మారి హత్య చేసిన ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నగరంలోని భగత్ సింగ్ కాలనీలోని జగనన్న కాలనీలో ఈనెల 18న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడి వివరాలను బుధవారం నవాబుపేట పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. జగనన్న కాలనీలో మణి, కుమారి దంపతులు ఉంటున్నారు. వారికి కుమార్తె, కుమారుడు వంశీకృష్ణ(26) ఉన్నారు. వంశీకృష్ణ క్యాటరింగ్ పనులు చేసేవాడు. ఈ నెల 18న మణి ఇంట్లో ఉండగా, ఆయన భార్య కిసాన్‌నగర్‌లోని కుమార్తె ఇంటికి వెళ్లారు. అదే రోజురాత్రి వంశీకృష్ణ దారుణహత్యకు గురయ్యాడు. ఈనెల 19న ఉదయం వంశీకృష్ణకు తల్లి ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో తల్లి, కుమార్తె ఇంటికి వచ్చారు. ఇంట్లో కుమారుడు రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉండటంతో కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ జీ. వేణుగోపాల రెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈనెల మంగళవారం సాయంత్రం ప్రశాంతినగర్ వద్ద కిసాన్‌నగర్‌కు చెందిన మల్లు సుధీర్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. మృతుడు వంశీకృష్ణ, సుధీర్ స్నేహితులు. వారు చెడు వ్యసనాలకు బానిసై తిరుగుతూ ఉంటారు. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో స్నేహితుడు ఇంట్లో లేని సమయంలో అతడి ఇంట్లోని వస్తువులను వంశీకృష్ణ ధ్వంసం చేశాడు. ఎందుకు చేశావని సుధీర్ ఫోన్‌లో ప్రశ్నించగా వంశీకృష్ణ దుర్భాషలాడారు. దీంతో కక్ష పెంచుకున్న సుధీర్, ఎలాగైనా వంశీకృష్ణను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 18న అర్ధరాత్రి వంశీకృష్ణ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని తెలుసుకొని సుధీర్ అక్కడకు వెళ్లాడు. నిద్రిస్తున్న వంశీకృష్ణపై నీళ్ల మోటర్‌తో ముఖంపై దాడిచేసి పరారయ్యాడు. పోలీసులు సాంకేతిక ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేశారు. హత్యకు వినియోగించిన నీళ్ల మోటర్, చాకును స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. త్వరిత గతిన కేసును ఛేదించిన నవాబుపేట ఇన్‌స్పెక్టర్ జీ. వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐలు రహమాన్, శివయ్య, సిబ్బంది ఎస్ఐ ప్రసాద్, ఆర్‌పీ రత్నయ్య, ఎం వేణు, జీ. మస్తానయ్య, షేక్ గౌస్‌బాషాలను ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అభినందించారు.

బైక్, ఆటో ఢీ : యువకుడి మృతి


మృతి చెందిన గణేష్

వెంకటాచలం (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం సమీపం లోని జగనన్న కాలనీ వద్ద జాతీయ రహదారి పై బుధవారం మోటర్ బైక్, ఆటో ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన గణేష్, దినేష్, అభిలాష్ కలిసి బైక్‌పై పెళ్లి బట్టలు కొనేందుకు నెల్లూరుకు బయలుదేరారు. వెంకటాచలం దాటిన తర్వాత జగనన్న కాలనీ వద్ద ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఆటో బైక్‌కు తగిలింది. దీంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గణేష్ (35) తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ దినేష్, అభిలాష్‌లను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● ఆగిఉన్న లారీని ఢీకొని..


మృతి చెందిన ఉస్మాన్‌షరీఫ్

దగదర్తి(బిట్రగుంట), జూలై 23(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం ఉలవపాళ్ల సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని ఫైపాడ్‌గేట్ ప్రాంతానికి చెందిన షేక్. ఉస్మాన్‌షరీఫ్ (28) తన స్నేహితుడు గణేష్‌తో కలిసి మోటారు సైకిల్‌పై కావలి వైపు వెళుతున్నారు. మార్గమధ్యంలో ఉలవపాళ్ల సమీపంలో పెట్రోల్ బంకు దాటిన తరువాత మరమ్మతులకు గురై రహదారిపై ఆగిఉన్న లారీని గమనించకుండా మోటారు సైకిల్‌తో వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఉస్మాన్‌షరీఫ్ అక్కడికక్కడే మృతి చెం దాడు. గణేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఉస్మాన్‌షరీఫ్ మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా గణేశ్‌ది బోగోలు మండలం నాగులవరంగా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ జంపాని కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యర్రబొట్లపల్లిలో అక్రమ మైనింగ్ సీజ్

● ఎక్స్‌కవేటర్ స్వాధీనం


మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు కోటేశ్వరరావు, ఎస్ఐ మాల్యాద్రి, తదితరులు

కొండాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట పంచాయతీ ఎర్రబొట్లపల్లిలో అక్రమ మైనింగ్ జరుగుతుండగా మంగళవారం రాత్రి గ్రామస్థులు అడ్డుకొని 100కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం తహసీల్దారు కోటేశ్వరారవు, ఎస్ఐ మాల్యాద్రి, వీఆర్వో కొండయ్య అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. గత కొంతకాలంగా యర్రబొట్లపల్లి గ్రామ సరిహద్దులోని ప్రభుత్వ భూమిలో రాత్రి వేళల్లో బాంబులు పేల్చుతూ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి అధికారులు వెళ్లేసరికి అక్కడ ఉన్న వ్యక్తులు పారిపోయారు. దీంతో బాంబులు ఏర్పాటు చేసి ఉంటారని బాంబు స్క్వాడ్‌ను పిలిపించి పరిశీలించగా బాంబులు లేవని తేల్చారు. అక్కడ ఉన్న వైర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వ్యక్తులను గుర్తించి కేసు నమోదు చేస్తామని తహసీల్దారు కోటేశ్వరారవు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 505

ఉపాధి పనులపై సభ్యుల ఏకరువు

బిట్రగుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సుజాత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇప్పటివరకు చేపట్టిన పనులు, చేయాల్సి ఉన్నవాటిపై అధికారులు నివేదిక సమర్పించారు. రీసర్వే తరువాత రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, విద్యుత్ సమస్యలు, ఉపాధి పనులపై సభ్యులు ఏకరువు పెట్టారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, విద్యుత్ ఏఈ జడరాయ్, ఎంఏవో శైలజ, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ జడ రాయ్

న్యూస్ బాక్స్

తాళం వేసిన ఇంట్లో చోరీ

● 20 సవర్ల బంగారం అపహరణ

కావలి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరులో పల్లపు మాల్యాద్రి ఇంట్లో చోరీ జరిగిన విషయం బుధవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. మాల్యాద్రి భార్యకు ఆరోగ్యం సరిలేక పోవడంతో చికిత్స నిమిత్తం ఈనెల 18వ తేదీన ఇంటికి తాళం వేసి నెల్లూరుకు వెళ్లి అక్కడే ఉన్నారు. ప్రతి రోజూ ఇంటి వద్ద చెట్లకు నీళ్లు పోసి పోతున్న పనిమనిషి బుధవారం వచ్చి చూసేసరికి ఇంటి తలుపుల తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి మల్యాద్రికి సమాచారం ఇచ్చింది. ఆయన వచ్చి ఇంట్లో పరిశీలించగా గుర్తు తెలియని దుండగులు బీరువా పగలగొట్టి అందులోని సుమారు 20 సవర్ల బంగారు ఆభరణాలు దొంగిలించుకు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ సీఐ జీ.రాజేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెల్లూరు క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు స్వీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై రాయితో దాడి

కావలిరూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం విందూరివారి వీధికి చెందిన సన్నిబోయిన కొండలరావు తన ఇంటి వద్ద ప్రహరీ గోడ నిర్మాణానికి సన్నాహాలు చేస్తుండగా పక్క ఖాళీ స్థలానికి చెందిన మొచ్చు శ్రీనివాసులు బుధవారం రాయితో దాడి చేశాడు. దీంతో కొండలరావుకు గాయాలై ఓ పన్ను ఊడిపోయింది. బాధితుడి వివరాల మేరకు.. కొండలరావు ఇంటి పక్కన శ్రీనివాసులు ఖాళీ స్థలం ఉంది. కొండలరావు ఇంటి స్థలంలో నా స్థలం కలిసి ఉందంటూ శ్రీనివాసులు తరచూ వివాదాలకు దిగేవాడు. ఈ క్రమంలో సుమారు 6 నెలల క్రితం కొండలరావు ప్రహరీ గోడకు ఆనుకుని శ్రీనివాసులు ఉద్దేశ పూర్వకంగా గుంట తవ్వించడంతో కొండలరావు ఇంటి ప్రహరీ కూలింది. అప్పట్లో ఇరువురి మధ్య వివాదం జరిగింది. అనంతరం కొండలరావు ప్రహరీ నిర్మాణానికి సన్నాహాలు చేసుకుంటుండగా ఈ దాడి జరిగింది. క్షతగాత్రుడు కొండలరావు చికిత్స నిమిత్తం ఆయన స్నేహితుడు మంచాల ప్రసాద్ ఏరియా వైద్యశాలకు తరలించాడు. బాధితుడి ఫిర్యాదుతో 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి పొంగళ్లలో ఇరువర్గాల వాగ్వివాదం

లింగసముద్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నెబోయినపల్లిలో గ్రామ దేవత గంగమ్మకు పొంగళ్లు జరుపుకొనే విషయమై ఇరువర్గాల మధ్య బుధవారం రాత్రి తీవ్ర వాగ్వివాదం జరిగింది. గ్రామంలోని యాదవ సామాజిక వర్గం వారు ఎస్సీ కాలనీ సమీపంలోని గంగమ్మ గ్రామ దేవతకు పొంగళ్లు జరుపుకొనేందుకు ఊరేగింపుగా వస్తుండగా ఎస్సీ కాలనీకి చెందిన కొందరు అడ్డుకొన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాదన జరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే విషయం తెలుసుకున్న గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్ఐ నారాయణలు పోలీసు బందోబస్తుతో వెళ్లి ఇరువర్గాలతో చర్చించి పొంగళ్లు ప్రశాంతంగా నిర్వహింపజేశారు.

రేపు సీపీఐ నియోజకవర్గ మహాసభ

కందుకూరు/వలేటివారిపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న నిర్వహించనున్న సీపీఐ కందుకూరు నియోజకవర్గ 4వ మహాసభను జయప్రదం చేయాలని ఆపార్టీ కార్యదర్శి బి.సురేష్‌బాబు కోరారు. కందుకూరులోని పామూరు బస్టాండ్ సెంటర్‌లోని లక్ష్మీశ్రీనివాస కల్యాణ మండపంలో మహాసభ జరుగుతుందని, ఉదయం 10 గంటలకు ఓవీ రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆగస్టు 3,4 తేదీలలో నెల్లూరు నగరంలో జిల్లా మహాసభలు జరుగుతాయని, ఆగస్టు 20 నుంచి 25వరకు ఒంగోలు నగరంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో మహసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి బాలకోటయ్య, నాయకులు ఆనంద్ మోహన్, బాలబ్రహ్మాచారి, మురళి, అంజయ్య పాల్గొన్నారు.

విద్యకు దూరం కాకూడదు

బిట్రగుంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యకు దూరం కాకుండా అని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేర్పాలని కావలి ఉప విద్యాశాఖాధికారి ఎం.హరిప్రసాద్ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం గిరిజన కాలనీలో ప్రధానోపాధ్యాయుడు గంగాధరరావు, పీడీ నరసింహమూర్తి నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన బుధవారం సందర్శించారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్ కోసం సహాయ సహకారాలు అందిస్తున్న బాలికల పాఠశాల హెచ్‌ఎం బీ.నీరజ, డాక్టర్ చంద్ర, టీడీపీ నేతలు నాగేశ్వరరావు, సుధీర్‌బాబు, సర్పంచు మంజులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఉపవిద్యాశాఖాధికారి పీ.నరసింహారావు, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


ముత్యాలపాడులో ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రామికులు(ఫైల్)

‘ఉపాధి’ బకాయిలు రూ.3.24 కోట్లు

● 8 వారాల నుంచి అందని నగదు ● అవస్థలు పడుతున్న శ్రామికులు

లింగసముద్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న శ్రామికులకు 8 వారాల నుంచి కూలి డబ్బులు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ 4500 మంది చొప్పున 1 లక్షా 44 వేల పని దినాలకు రూ.3.24 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత ఏప్రిల్ నుంచి ఇతర ఏ పనులు లేకపోవడంతో ఉపాధి హామీ పనులే దిక్కవడంతో ఎక్కువ మంది ఈ పనులకు హాజరవుతున్నారు. సుమారు 2 నెలలుగా కూలి డబ్బులు రాకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఉపాధి హామీ పథకం ఏపీవో షేక్ సమీర్‌బాషాను వివరణ కోరగా 8 వారాలకు సంబంధించి 1 లక్షా 44 వేల పని దినాలకు రూ.3.24 కోట్లు రావాల్సి ఉన్న మాట వాస్తవమేనన్నారు. కూలి డబ్బులు వచ్చిన వెంటనే శ్రామికుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు. ప్రస్తుతం మండలంలో ముత్యాలపాడు, మొగిలిచెర్ల, మేదరమిట్లపాలెం, చినపవని గ్రామాలలో పనులు జరుగుతున్నాయని, ఈ పనులకు రోజుకు 500 మంది శ్రామికులు హాజరవుతున్నారని చెప్పారు.

గ్రామదేవత అంకమ్మకు ఆషాఢం సారె


అంకమ్మకు ఆషాఢం సారె తీసుకొస్తున్న మహిళలు

కందుకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మకు బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు ఆషాఢం సారె సమర్పించారు. పట్టణంలోని పెద్దబజారులోని కోదండరామాలయం నుంచి మహిళలు పెద్దసంఖ్యలో సారెతో బయలుదేరి బ్యాంకుబజారు, పోస్టాఫీసుసెంటర్ మీదుగా అంకమ్మ ఆలయానికి చేరుకుని పొంగళ్లు, పసుపుకుంకుమ, ఆషాఢం సారె సమర్పించారు. ఈ సందర్భంగా మహిళాభక్తులు లలితా సహస్రనామ పారాయణం చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన తటవర్తి జానీ, ఇస్కాల శోభారాణి, మాధురిలకు సమరసతసేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టరు తన్నీరు మల్లికార్జునరావు, చక్కా వెంకటకేశవరావు, అనిల్, సత్యవతి, మంచిరాజు మురళి, మురారిశెట్టి వెంకటసుబ్బారావు, కోట వెంకటనరసింహం, తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ నిక్షేపాలను ధారాదత్తం చేస్తే ఒప్పుకోం


లింగసముద్రం : యర్రారెడ్డిపాలెంలో యంత్రాలతో తీస్తున్న ఐరన్ ముక్కలను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

లింగసముద్రం/వలేటివారిపాలెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం, వలేటివారిపాలెం మండల్లాలోని పలు గ్రామాల్లో బయటపడిన ఖనిజ నిక్షేపాలను జిందాల్ కంపెనీకి ధారాదత్తం చేయడాన్ని ఒప్పుకోబోమని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ జి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ప్రతినిధి బృందం లింగసముద్రం మండలంలోని యర్రారెడ్డిపాలెం, వలేటివారిపాలెం మండలంలోని అయ్యవారిపల్లి ప్రాంతంలో ఖనిజ నిక్షపాలు ఉన్న ప్రాంతాలను పరిశీలించింది. ఈ సందర్భంగా వారు యర్రారెడ్డిపాలెంలో మిషనరీ ద్వారా తీస్తున్న ఐరన్ ముక్కలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మా ప్రాంతంలో వెలికితీస్తున్న ఖనిజ సంపద తమ ప్రాంత వాసులకే చెందాలన్నారు. లేదంటే వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. అలాగే లింగసముద్రం మండలంలోని యర్రారెడ్డిపాలెం, జంగంరెడ్డి కండ్రిక, ఆర్ఆర్ పాలెం, వలేటివారిపాలెంలోని అయ్యవారిపల్లి తదితర గ్రామాలలో ప్రభుత్వ భూములు, కొండలు, పట్టా భూములు, సుమారు 790 ఎకరాలు జియోగ్రాఫికల్ సర్వే అధికారుల ద్వారా సర్వే చేయించి ఐరన్ నిక్షేపాలున్నట్టు నిర్ధారించారన్నారు. ఈ సంపద అంతా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు గుట్టుచప్పుడు కాకుండా జిందాల్ కంపెనీకి కట్టబెట్టడం సరైంది కాదన్నారు. ప్రభుత్వమే ఖనిజ సంపదను వెలికితీసి ఈ ప్రాంతంలో ఉక్కు ఖర్మాగారాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. తద్వారా ఈ ప్రాంత యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిందాల్ కంపెనీకి, ఓఎన్‌జీసీ కంపెనీకి ఎన్‌ఓసీలు ఇవ్వడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టే వెంకటయ్య, దువ్వూరి జాన్, వెంకయ్య, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ షూస్ బహూకరణ


స్పోర్ట్స్ షూస్ అందుకున్న విద్యార్థులతో బెస్ట్‌వాకర్స్, కేకేసీ సభ్యులు

కావలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కావలి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ నెట్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులకు కావలి బెస్ట్‌వాకర్స్ అసోసియషన్ బాధ్యులు బుధవారం స్పోర్ట్స్ షూస్‌ను అందచేశారు. క్రికెట్ నెట్ ప్రాక్టీస్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత సబ్‌ఇన్‌స్పెక్టర్ శేషయ్య, కేకేసీ సభ్యుడు రాంబాబు, కావలి క్రికెట్‌క్లబ్ అధ్యక్షుడు సిద్దూ, పలువురు క్లబ్ బాధ్యులు, బెస్ట్‌వాకర్స్ అసోసియేన్ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

● కావలి డీఎస్పీ శ్రీధర్

కావలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వినియోగంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రజలు సెల్‌ఫోన్ వినియోగించేటప్పుడు అప్రమత్తగా ఉండాలని కావలి డీఎస్పీ పీ.శ్రీధర్ తెలిపారు. ఎయిర్‌టెల్‌లో ఫేక్ కాల్ లింక్ తెరుచుకోకుండా ఉండే విధంగా తీసుకువచ్చిన ఏఐ టెక్నాలజీపై ఆ సంస్థ బాధ్యులు బుధవారం తహసీల్దారు కార్యాలయం ఎదురుగా వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగం వచ్చిన తర్వాత ప్రజలు అత్యాశకు పోయి ఇళ్లలో కూర్చుని ఏదో సంపాదించాలని ఆశపడుతున్నారన్నారు. కష్టం లేకుండా డబ్బులు సంపాదించాలని అత్యాశకు పోయిన వారంతా మోసపోయి నష్టపోతున్నారన్నారు. దీనివలన సమాజంలో జనరల్ క్రైం తగ్గుతున్నా సైబర్‌క్రైం మాత్రం పెరుగుతోందన్నారు. మహిళలు సైతం ఇళ్లలో పురుషులకు తెలియకుండా సెల్‌ఫోన్‌ల ద్వారా స్కీంలో డబ్బులు కట్టి సైబర్ క్రైమ్‌లలో ఇరుక్కుని మోసపోతున్నారని చెప్పారు. ఎవరూ ఎలాంటి లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ఎక్కువగా సైబర్ క్రైంలకు పాల్పడే వారంతా హిందీలో మాట్లాతారని అలాంటి వారితో వచ్చీరాని హిందీ మాట్లాడే ప్రయత్నం చేయకుండా స్పష్టమైన తెలుగులో గట్టిగా మాట్లాడితే వాడే భయపడి పెట్టేస్తారన్నారు. కావలికి చెందిన డాక్టర్ల దంపతులు షేర్స్ యాప్‌లోకి వెళ్లి డబ్బులు కట్టి సుమారు రూ.2కోట్లపైన మోసపోయారన్నారు. అలాగే మరో వ్యాపారస్థుడు కూడా రూ.40 లక్షలు మోసపోయారన్నారు. కనుక ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలలో ఇరుక్కోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌టెల్ కంపెనీ బాధ్యులు రవి, పవన్, కిరన్, తరుణ్, కావలి డిస్ట్రిబ్యూటర్ సోమిశెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ సుడిగాలి పర్యటన


రామ్మూర్తి పేటలో రోడ్డు పక్కన వేసిన బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌పై స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

కావలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్ బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. రామమూర్తిపేటలో రోడ్ల వెంబడి, ప్రభుత్వ ఖాళీస్థలాల్లో వేసి ఉన్న బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను పరిశీలించి స్థానికులతో ఆ మెటీరియల్ ఎవరు వేశారని ఆరా తీశారు. మెటీరియల్ వేసిన వారిని పిలిపించి వెంటనే దానిని తొలగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం మొర్లవారిపాలెంలో ఉన్న డంపింగ్‌యార్డులో ఏర్పాటు చేసి త్వరలో ప్రారంభం కానున్న బయోమైనింగ్ యూనిట్‌ను పరిశీలించారు. అలాగే పలు ప్రాంతాలను పరిశీలించారు.

క్రమశిక్షణ, దృఢసంకల్పంతోనే లక్ష్యసాధన


ఉదయ్‌కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న వినయ్‌కుమార్‌రెడ్డి

కావలి(టౌన్), జూలై 23 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, దృఢ సంకల్పం లక్ష్యసాధనకు దోహదపడతాయని డిసిగ్నేటెడ్ ఐపీఎస్ ములగాని ఉదయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జేబీ డిగ్రీ కళాశాల ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ఉదయ్‌కృష్ణారెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి ఆయనను శాలువా సత్కరించి మాట్లాడుతూ విశ్వోదయ పూర్వ విద్యార్థి సివిల్స్‌లో 350 ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు అర్హత సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

● పుల్లారెడ్డి నగర్‌లోని గొట్టిపాటి సమావేశ మందిరంలో యుపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కూరపాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉదయ్‌కృష్ణారెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత రీజినల్ మేనేజర్ ప్రభాకర్ రెడ్డి, పారిశ్రామికవేత్త ధనుంజయరెడ్డి, జేబీ వీడీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ట్రేడ్ యూనియన్ వార్షికోత్సవం

కందుకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): బీఎంఎస్ ట్రేడ్‌యూనియన్ 70వ వార్షికోత్సవాన్ని స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. పోస్టల్ ఉద్యోగులతో పాటు ఎల్ఐసీ, రైల్వే ఉద్యోగులు పాల్గొని బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గడచిన 70 ఏళ్లలో బీఎంఎస్ చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను మననం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీపీఈఏ నాయకులు ఎం.సతీష్, బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ జొన్నాదుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘సుపరిపాలనలో తొలి అడుగు’

వలేటివారిపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఈ ఏడాది ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకుమాను ఆంజనేయులు, వీరమోసు అంజయ్య, సుందాడి నాగేశ్వరరావు, బూదాల మనోజ్, దుద్దూరి అంజయ్య వలేటి వెంగళరావు, పోతురాజు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ట్రాఫిక్ పోలీస్‌లకు యూనిఫాం అందజేత


ట్రాఫిక్ పోలీస్‌లకు యూనిఫాం అందచేస్తున్న డీఎస్పీ

కావలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో హోమ్‌గార్డులకు, ట్రాఫిక్ పోలీస్‌లకు యూనిఫాం, టోపీలు, కళ్ల అద్దాలు, గ్లౌజ్‌లు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ సమకూర్చిన వీటిని డీఎస్పీ పీ. శ్రీదర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో విధులు నిర్వహిస్తున్న పోలీస్‌సేవలను గుర్తించి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు రమేష్ యూనిఫాంలు, అద్దాలు, టోపీలు అందించటం అభినందనీయమన్నారు. రానున్న వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని పోలీస్ సిబ్బందికి ఆర్యవైశ్యసంఘం తరుపున రెయిన్‌కోట్‌లు అందచేయాలని డీఎస్పీ కోరారు. దీనిపై స్పందించిన ఆయన రెయిన్‌కోట్‌లు పంపిణీ చేసేందుకు తమ సంఘం సిద్ధంగానే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఫిరోజ్, గిరిబాబు, ఆర్యవైశ్యసంఘం నేతలు, వాసవీక్లబ్, సెవెన్‌లైన్స్ సభ్యులు, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

కలిగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దారు ఎం గిరీష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెలగపాడు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లికివందనం, అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమపథకాల లబ్ధిదారుల జాబితా కార్యాలయం వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. సచివాలయానికి వచ్చే పౌరులపట్ల గౌరవభావం కలిగి విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ క్లార్యదర్శి తనూజ, వీఆర్వో రవి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం కందుకూరు మున్సిపాలిటీలోని 19వ వార్డులో సాయంత్రం నిర్వహించిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, సయ్యద్ సుల్తాన్, దండే శ్రీనివాసరావు, ముస్తాక్, మసూద్, హర్షత్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

కందుకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మేక్ ఏ ఛేంజ్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని జనార్దనకాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు బుధవారం నోట్‌పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రవ్వా శ్రీనివాసులు, గుర్రం చినఅల్లూరయ్య, చక్కా వెంకటకేశవ, పాఠశాల వైస్‌చైర్మన్ రామరాజు, ఉపాధ్యాయులు బి. పద్మజ, అత్తోట రమేష్, ఇర్షాద్ అహ్మద్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్


చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని అంతర్గత రహదారులన్నింటిని సీసీరోడ్లుగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని కావలిముస్తాపురం పంచాయతీ పరిధిలోని దంటుపాలెం ఎస్సీ కాలనీలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్ల నిర్మాణం కావాలని కోరగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ఎమ్మెల్యే వద్దకు రాగా ఎలా చదువుతున్నారు... పాఠశాలలో పూర్తిగా సౌకర్యాలు ఉన్నాయా, తల్లికివందనం నగదు జమ అయిందా తదితర విషయాలను వారిని అడిగి తెలుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచు పోలవరపు సుబ్బానాయుడు, మాలేపాటి జనార్దన్ నాయుడు, మాలేపాటి రమేష్, మద్దినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు మహారుద్రాభిషేకం

ఉలవపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : గ్రామ శ్రేయస్సు, దుష్ట పరిణామాల నుంచి సంరక్షణ కోసం కరేడు గ్రామంలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో స్వామివారికి బుధవారం 17 మంది వేదపండితుల మంత్రోచ్చరణలతో మహారుద్రాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో స్వామివారి అభిషేకంలో పాల్గొని శివయ్య కృపకు పాత్రులయ్యారు. స్వామివారి తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ స్వీకరించారు.

ఓపెన్ స్కూల్ ప్రాధాన్యతపై అవగాహన


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో బ్రహ్మయ్య, ఎంఈవో నాగేశ్వరరావు, తదితరులు

జలదంకి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్ స్కూల్ ఎన్రోల్‌మెంట్‌లో భాగంగా స్థానిక ఎంఈవో కార్యాలయంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లకు బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. బడిబయట 14 ఏళ్ల లోపు ఉన్న వారిని ఓపెన్‌స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేర్పించి వారిని విద్యావంతులను చేసేందుకు ఓపెన్ స్కూల్ ఉపయోగపడుతుందని ఎంఈవో నాగేశ్వరరావు పేర్కొన్నారు. తద్వారా వారు విద్యావంతులై చిన్న చిన్న కంపెనీలలో ఉద్యోగాలతో పాటు స్వశక్తితో వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం ఎంపీడీవో బ్రహ్మయ్య ఆంధ్రప్రదేశ్ విద్యాపీఠం గోడపత్రికను ఆవిష్కరించారు.

ఉలవపాడులో ‘బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ’

ఉలవపాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం ఉలవపాడులోని దర్గా సెంటర్‌లో వైసీపీ శ్రేణులు బుధవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు నన్నం పోతురాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెలిచర్ల ధనకోటి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిశోర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల కొండయ్య, జీ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతల పూజలు

కావలి(టౌన్), జూలై 23(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం కలుగోళశాంభవి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు, అభిమానులు పాల్గొన్నారు.



5లక్షల జనాభా.. రోజూ లక్షమంది యాత్రికుల తాకిడి ఉండే నగరం తిరుపతి. ఐదేళ్లు గందరగోళంగా మారిన నగర వ్యవస్థను గాడిలో పెట్టడం పెద్ద సవాలు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్‌గా నారపరెడ్డి మౌర్య ఆ సవాలును స్వీకరించారు. ఆర్థిక సమస్యలు అధిగమిస్తూ, ప్రజాప్రతినిధులనూ, అధికార యంత్రాంగాన్నీ సమన్వయం చేసుకుంటూ సాగుతున్నారు. నగరపాలక సంస్థ సారథిగా బాధ్యతలు చేపట్టి నేటికి సరిగ్గా ఏడాది అయిన సందర్భంగా కమిషనర్ మౌర్యతో ఆంధ్రజ్యోతి సంభాషణలోని ముఖ్యాంశాలు..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతి నగర కమిషనర్‌గా మౌర్య బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది

■ ఇంటర్వ్యూ

తిరుపతి తీరు మారుతోంది

● యూడీఎస్, సీవోసీ, ప్రతిరోజూ తాగునీరు లక్ష్యాలు

? సవాలుగా స్వీకరించిన బాధ్యత

! రాయలసీమలోనే అత్యంత ప్రాధాన్యం ఉన్న వేడుక తిరుపతి గంగ జాతర. ఆ బాధ్యతలను నాకు అప్పగించారు. నాలుగు నెలలముందే వైకుంఠం టోకెన్ల జారీ సమయంలో తొక్కిసలాట ఘోరం కళ్లముందు మెదుల్తానే ఉంది. అన్ని విభాగాలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాను. చాటింపు రోజు నుంచి కంకణం కట్టుకున్నట్టుగా గంగమ్మ ఆలయంలోనే తిష్టవేసి కూర్చున్నా. సీసీ కెమెరాలను పరిశీలిస్తుండేదాన్ని. వీఐపీ పాసులను రద్దుచేశాం. ఉత్సవ కమిటీ సభ్యుల సపరివార సమేత హడావుడిని తగ్గించా. జాతర చివరి రెండు రోజులు గర్భగుడిలోకి అర్చకేతరులను అనుమతించలేదు. ఒకవైపు కార్పొరేషన్, తుడా బాధ్యతలు చూస్తూ, మరో వైపు జాతరలో ఓ భక్తురాలిగా పొంగళ్లు పెట్టి, సారెలు ఇస్తూ భక్తుల అవసరాలను అడిగి తెలుసుకుంటూ జాతరను జయప్రదం చేయడంలో ప్రధాన భూమిక పోషించానన్న సంతృప్తి కలిగింది.

? పన్నుల వసూళ్లు

! పన్నుల వసూళ్లలో తిరుపతి నగరపాలక సంస్థ రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. 2023-24లో రూ.84కోట్లు మాత్రమే వసూళ్లు కాగా, ఈసారి వంద కోట్ల మార్కు దాటింది. 2024 వరకు ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ టెండరు రూ.2.58కోట్లు మాత్రమే. అదిప్పుడు జీఎస్టీతో కలిపి దాదాపు రూ.5కోట్లకు పెరిగింది.

? టీడీఆర్ బాండ్లపై ప్రజల్లో అసంతృప్తి ఉంది.

! నేను బాధ్యతలు తీసుకునే ముందు టీడీఆర్ బాండ్ల అవకతవకలపై గందరగోళ పరిస్థితులు ఉండేవి. ఓవైపు విజిలెన్స్ విచారణ జరుగుతోంది. మరో వైపు టీడీఆర్ మేళా ద్వారా పరిశీలన చేసి నిజమైన లబ్ధిదారులకు బాండ్లు అందజేశాం. ఇప్పటివరకు 242 మందికి బాండ్లు ఇచ్చాం.

? ఏడాదిలో ఏమేం చేశారు.

! రూ.30కోట్లతో 267 అభివృద్ధి పనులను చేపట్టాం. కొత్తరోడ్లు, ప్యాచ్‌వర్కులు, కాలువల్లో పూడికతీత, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు వంటి పనులు జరిగాయి. మరో రూ.30కోట్లతో 50 పనులు టెండరు దశలో ఉన్నాయి. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కొర్లగుంట సర్కిల్ (ఆరోగ్య ఫార్మసీ) డ్రైనేజీ సమస్యను పరిష్కరించాం. ఎమ్మార్ పల్లిలో యాచకులకు పునరావాస కేంద్రం ఏర్పాటుచేశాం.

ఇవి చేయబోతున్నాం!

- కేంద్ర ప్రభుత్వ ప్రజారోగ్య, పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ (చెప్కో) తిరుపతిలో యూడీఎస్ ప్రక్షాళనకు దాదాపు రూ.90కోట్లు వెచ్చించేందుకు ముందుకొచ్చింది. ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా మురుగునీటిని శుద్ధి చేసి వ్యవసాయానికి వినియోగించేలా చర్యలు చేపడుతున్నాం.
- మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణ పనులు నేను బాధ్యతలు తీసుకునేప్పటికి పాతిక శాతం కూడా జరగలేదు. 8 నెలల్లోనే 70 శాతం పూర్తి చేశాం. మరో 8 నెలల్లో పూర్తి చేస్తాం.
- స్కావెంజర్స్ కాలనీకి రంగులు వేయడమే కాదు. వారి జీవితాలను రంగులమయం చేయాలని వుంది. ● తిరుపతిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మార్చాలని ఇటీవల తిరుపతి పర్యటనలో సీఎం చెప్పారు. ఆ దిశగా ప్రణాళికలు జరుగుతున్నాయి. పెళ్లిళ్లు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు అవసరమైన అన్ని హంగులు మరో రెండేళ్లలో తిరుపతికి రానున్నాయి.
- మరో రూ.50కోట్లతో నగరమంతా ప్రతి రోజూ నీరు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
- శ్రీనివాసం సమీపంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయనున్నాం. ● లీలామహల్ వద్ద ఉన్న ఫిష్ మార్కెట్‌ను రేణిగుంట రోడ్డులోని ఓ మాస్టర్ ప్లాన్ రోడ్డు వద్దకు మార్చబోతున్నాం.
- స్ట్రీట్ వెండింగ్‌పై సర్వే చేసి కార్డులు ఇచ్చి వెండింగ్ జోన్‌లు పెట్టడం వల్ల ఫుట్‌పాత్ ఆక్రమణలు తగ్గించబోతున్నాం.



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు

సెప్టెంబరు 14, 15 తేదీల్లో

జాతీయ మహిళా సాధికారత సదస్సు

● తిరుపతి వేదికగా నిర్వహణ ● హాజరుకానున్న 300మందికి పైగా మహిళా ప్రజాప్రతినిధులు
● ఏర్పాట్లు పక్కాగా ఉండాలంటూ అధికారులకు స్పీకర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాజ్‌హోటల్‌లో సెప్టెంబరు 14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికారత సదస్సు (చట్టసభల జాతీయ మహిళా సాధికార సభ్యుల సదస్సు) నిర్వహిస్తున్నట్లు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి సదస్సు నిర్వహణపై జిల్లా యంత్రాంగంతో సమీక్షించారు. దేశంలోని 31 అసెంబ్లీలలో మహిళా కమిటీలు ఉన్నాయన్నారు. ఈ కమిటీల ద్వారా అనేక సమస్యలపై చర్చలు జరుగుతుంటాయని తెలిపారు. ప్రతి సమస్యను స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పరిష్కరించాలంటే కష్టమైన పనని, అందుకోసమే ఇలాంటి సదస్సులు నిర్వహించి అందులో చర్చా విధానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. ఈ నేపథ్యంలోనే చట్టసభల జాతీయ మహిళా సాధికారత సభ్యుల సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలుత విశాఖలో నిర్వహించాలని అనుకున్నా.. శ్రీవారు కొలువైన తిరుపతిలో నిర్వహించాలని పార్లమెంట్ స్పీకర్ ఓంబిర్లా సూచించారన్నారు. ఎప్పటికీ గుర్తుండిపోయేలా సెప్టెంబరు 14, 15 తేదీలలో తిరుపతిలో పార్లమెంటరీ, లెజిస్లేటివ్ కమిటీ ఆన్ ఎన్‌పవర్ ఆఫ్ ఉమెన్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీకి ప్రతి రాష్ట్రం నుంచి ఆరుగురు.. ప్రతి అసెంబ్లీ నుంచీ ఆరుగురు చొప్పున మహిళా ప్రజాప్రతినిధులు తాజ్ హోటల్‌లో జరిగే ఈ సదస్సుకు హాజరవుతారన్నారు. ఇలా 300మందికిపైగా హాజరయ్యే సభ్యులు రెండు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి ఆ నివేదికను పార్లమెంటు, అసెంబ్లీ ద్వారా తీసుకెళ్తారని అయ్యన్నపాత్రుడు తెలిపారు. 'సదస్సు అనంతరం తిరుమల, శ్రీకాళహస్తి, శ్రీసిటీ, శ్రీహరికోట, చంద్రగిరి కోటను సభ్యులు సందర్శిస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారు. సదస్సు, వీరి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.



స్పీకర్‌ను సత్కరించి జ్ఞాపిక బహూకరిస్తున్న కలెక్టర్

మహిళాభ్యున్నతికి సీఎం కృషి

సీఎం చంద్రబాబు నాయుడు మహిళాభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా చట్టసభల్లో, పదవుల కేటాయింపులో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. తిరిగి 15 రోజుల తర్వాత మళ్లీ సమీక్షిస్తామన్నారు. వచ్చే కమిటీ సభ్యులకు బస, వసతి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, ఆదిమూలం, రామకృష్ణ, శాప్ చైర్మన్ రవినాయుడు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, కమిషనరు మౌర్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నరసింహయాదవ్, సుగుణమ్మ, సదాశివం, హరిప్రసాద్, టీడీపీ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం, సినీ హీరో పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాను బుధవారం రాత్రి తిరుపతిలో ప్రదర్శించారు. ఈ ఫ్యాన్స్ షో సందర్భంగా గ్రూప్ థియేటర్స్ వద్ద సందడి కనిపించింది. అభిమానులు, జనసైనికులు టపాసులు కాల్చి, పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి, కర్పూర హారతులిచ్చి తమ అభిమానం చాటారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

కళ్లు చెదిరే కళాకృతులు

● శిక్షణ దశలోనే విద్యార్థుల నైపుణ్య ప్రతీకలు
● టీటీడీ శిల్పకళాశాలలో అలరిస్తున్న కళారూపాలు

- వివరాలు 6లో -



జాతీయ భద్రతపై సెమినార్‌కు కలెక్టర్

తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతపై కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 15నుంచి 19వ తేదీ వరకూ నిర్వహించనున్న సెమినార్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరుకానున్నారు. హైదరాబాదులోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో జరిగే ఈ సెమినార్‌కు ఏపీ నుంచీ ప్రభుత్వం ఆయన్ను డెప్యుటేట్ చేసింది. దీనికోసం ఆయన సెప్టెంబరు 12వ తేది రిలీవ్ అయి.. 14న అకాడమీలో రిపోర్టు చేసుకుని, ఐదు రోజుల కార్యక్రమం పూర్తయ్యాక 20 లేదా 21న తిరిగి కలెక్టర్‌గా జిల్లాలో విధుల్లో చేరనున్నారు.

తలకోన సిద్ధేశ్వరాలయానికి మహర్దశ

● రూ.18 కోట్ల టీటీడీ నిధులతో ఆలయ పునరుద్ధరణ
● నిధుల మంజూరు, ఇ-టెండర్లకు ప్రభుత్వ అనుమతి



తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తలకోనలోని సుప్రసిద్ధ సిద్ధేశ్వరాలయానికి మహర్దశ పట్టనుంది. రూ.18 కోట్ల టీటీడీ నిధులతో ఆలయం పునరుద్ధరణకు నోచుకోనుంది. ఎర్రావారిపాలెం మండలం తలకోన అటవీ ప్రాంతంలోని సిద్ధేశ్వరాలయం పురాతనమైనది. తలకోనకు రోజువారీ వచ్చే పర్యాటకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులూ ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. జనవరి 1, మహా శివరాత్రి, కార్తీక మాసంలో వేలాది మంది భక్తులు తలకోనకు వచ్చి పుణ్యస్నానాలు చేసి సిద్ధేశ్వరాలయంలో పూజలు చేయడం ఆనవాయితీ. ఇప్పటికే అక్కడ టీటీడీ అతిథి గృహాలున్నాయి. తాజాగా భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు టీటీడీ ముందుకొచ్చింది. టీటీడీ ఇంజనీర్లు, స్థపతి క్షేత్రస్థాయిలో పర్యటించి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పునరుద్ధరణకు, ఇతర అభివృద్ధి పనులకు రూ.18 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఆ నిధులతో గర్భాలయం, మండపాలు, రాజగోపురం, ధ్వజస్థంభం వంటి వాటితో పాటు ఇతర నిర్మాణాలనూ చేపడతారు. ఇంజనీరింగ్ అధికారుల అంచనాలు రూపొందించాక ఈ ఏడాది మార్చి 24న జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో రూ.18 కోట్లు ఆర్థిక సాయం చేయడానికి ఆమోదిస్తూ తీర్మానం చేశారు. దీనిపై టీటీడీ ఈవో నిధులు మంజూరు చేయడంతో పాటు తొలి విడత ఇ-టెండర్లు పిలిచి రూ.2 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతి కోరుతూ ఏప్రిల్ 16న ప్రభుత్వానికి లేఖ రాశారు. దానిపై స్పందించిన ప్రభుత్వం నిధుల మంజూరుకు, ఇ-టెండర్లు పిలవడానికి అనుమతిచ్చింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎఫ్ఏసీ ముఖ్య కార్యదర్శి వి.వినయ్‌చంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

● భార్యను దూరం చేస్తోందని..

అత్తను కడతేర్చాడు

స్వర్ణముఖినదిలో మృతదేహం పూడ్చివేత

నాయుడుపేట టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భార్యను తన నుంచి దూరం చేస్తోందని భావించి అత్తను హత్య చేశాడా అల్లుడు. ఈ ఘటన నాయుడుపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నాయుడు పేట మండలం అయ్యప్పరెడ్డిపాళెంలోని సగుటూరు చెంగమ్మకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె స్వాతిని పండ్లూరు గ్రామానికి చెందిన వెంకయ్యకు ఇచ్చి వివాహం చేసింది. వీరిద్దరూ చెంగమ్మ ఇంటి వద్దే ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె. కొంతకాలంగా తన నుంచి భార్యను దూరం చేస్తోందని చెంగమ్మ మీద వెంకయ్య కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో నెల్లూరులో ఉన్న మరో కుమార్తె వద్దకు వెళ్లిన చెంగమ్మ మంగళవారం మధ్యాహ్నం తిరిగి నాయుడుపేటకు వచ్చింది. బస్టాండ్‌లో దిగిన ఆమెను వెంకయ్య తన ఆటోలో ఎక్కించుకొని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని స్వర్ణముఖినది వద్ద ఉన్న నర్సరీ సమీపంలోకి తీసుకెళ్లాడు. అక్కడ వారిద్దరి మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. వెంకయ్య తన దగ్గర ఉన్న కత్తితో చెంగమ్మ(45) గొంతుకోసి హతమార్చాడు. మృతదేహాన్ని అక్కడే వదిలేసి ఆటో తీసుకొని వెళ్లిపోయాడు. రాత్రి 10 గంటల సమయంలో పార తీసుకెళ్లి గుంట తవ్వి మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. ఈ ప్రాంతానికి సమీపంలో బుధవారం ఉదయం వెంకయ్య సంచరిస్తుండగా చెంగమ్మ బంధువులకు అనుమానం వచ్చి ప్రశ్నించారు. దేహశుద్ధి చేసి గట్టిగా నిలదీయడంతో చెంగమ్మను హతమార్చిన విషయం వెల్లడించాడు.కుటుంబసభ్యులు, బంధువులు పోలీసులకు సమాచారమిచ్చారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయంత్రం తహసీల్దారు రాజేంద్ర సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు వెంకయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



చెంగమ్మ (ఫైల్‌ఫొటో) - మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, సీఐ





అయ్యన్నపాత్రుడు - రఘురామకృష్ణ రాజు, గురజాల జగన్మోహన్ - డ్రమ్స్ శివమణి

తిరుమలలో ప్రముఖులు

తిరుమల, జూలై23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం, బీజేపీ నేత అశోక్, డ్రమ్స్ కళాకారుడు శివమణి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, తెలంగాణ ఎమ్మెల్సీ ఎల్ రమణ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ, ఎంతో నష్టపోయిన రాష్ట్రం ఇప్పుడిప్పుడే అభివృద్ధివైపు అడుగులేస్తోందని అన్నారు. అభివృద్ధిలో అందరం భాగం కావాలని పిలుపునిచ్చారు.

పవన్ సినిమా మాకో పెద్ద పండుగ


- తెలంగాణ టీఎఫ్‌సీసీ కార్యదర్శి శ్రీధర్



టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్, నిర్మాత సునీల్ నారంగ్

తిరుమల, జూలై23(ఆంధ్రజ్యోతి): 'దేవుడి దయతో చాలా రోజుల తర్వాత పవన్‌కల్యాణ్ పెద్ద సినిమా 'హరిహర వీరమల్లు' వస్తోంది. మాకో పెద్ద పండుగలా ఉంది. రేపటి నుంచి దీపావళి మొదలవుతుంది' అని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ శ్రీధర్ అన్నారు. నిర్మాత సునీల్ నారంగ్‌తో కలిసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ఈ చిత్రం పెద్ద హిట్ కావాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఆరు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.42 కోట్లు


మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,467


తలనీలాలు సమర్పించినవారు: 28,642



లక్ష్మీవరాహస్వామి


నాలుగు సింహాలు


శంఖునిధి


పద్మనిధి


వ్యాసమహర్షి


సంధ్యాతాండవం శివుడు


మురళీకృష్ణుడు


బయట ప్రధాన గేటు వద్ద శంఖు చక్రం, నామం


అష్టలక్ష్ములు, శ్రీపద్మావతి అమ్మవారు


సీఎంకు బహూకరించే శ్రీనివాసకల్యాణం ప్రతిమ

శయనమూర్తి

సరస్వతీదేవి, లక్ష్మీదేవి

కళ్లు చెదిరే కళాకృతులు

- శిక్షణ దశలోనే విద్యార్థుల నైపుణ్య ప్రతీకలు

మనసును కట్టిపడేసే ఈ శిల్పాలను చూస్తే చేయి తిరిగిన శిల్పి ఎవరో చెక్కారేమో అనిపిస్తుంది. కానేకాదు. అవి శిల్పకళలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తీర్చిదిద్దిన కళాకృతులంటే ఆశ్చర్యం కలుగుతుంది. తిరుపతిలోని టీటీడీ శిల్పకళాశాలలో నాలుగో ఏడాది (చివరి) విద్యార్థుల చేతిలో కళ్లు చెదిరే ఈ కళారూపాలు రూపుదిద్దుకున్నాయి. శిల, సుధా, దారు, లోహ విభాగాల్లో వివిధ రూపాలను చెక్కి అబ్బురపరిచారు. గోవిందరాజ సత్రాలను కూల్చే సమయంలో లభించిన టేకుతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు, అష్టలక్ష్ములతో కూడిన పద్మావతి అమ్మవారు, ప్రస్తుతం కాళీయమర్ధనంలాంటి శిల్పాలు ముచ్చటగొలుపుతున్నాయి. శిక్షణ పూర్తయ్యాక వెళ్లే క్రమంలో విద్యార్థులు ఇలా మనోహర శిల్పాలతో తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కళాశాల ప్రాంగణంలో వీటిని కొలువుదీర్చి ప్రత్యేక వన్నె తెచ్చారు. తామెప్పుడైనా కళాశాలకు వస్తే ఈ శిల్పాలు మధురానుభూతిని కలిగిస్తాయని విద్యార్థులు చెప్పారు. కొందరు ఆక్రాలిక్‌షీట్, క్యాన్వాస్‌లపై దేవతామూర్తుల పెయింటింగ్‌లను కూడా వేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి


కాళీయమర్ధనుడు


దశావతరాలు - వరసిద్ధివినాయకుడి లోహవిగ్రహం




టేకు కొయ్యతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు - శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనారాయణమూర్తి - సిమెంట్‌తో చేసిన లతాంగులు, నాట్యగత్తెలు

- టీటీడీ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు

25, 26 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 25, 26 తేదీల్లో ఉదయం 8 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. టీటీడీలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల పిల్లలు, బాల మందిర్ పిల్లలు, సీటు వచ్చి వివిధ కారణాలతో మూడు విడతలలో కౌన్సెలింగ్‌కు హాజరుకానివారికి, స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు, ఫీజులతో నేరుగా సంబంధిత జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావొచ్చు.

ఏరియా ఆస్పత్రుల్లో ట్రైబల్ సెల్

- ఏర్పాటు చేయాలంటూ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రుల్లో ట్రైబల్ సెల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా నివసించే గిరిజనులపై అధికారులు దృష్టిపెట్టి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించి, లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. గిరిజనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసుశాఖను ఆదేశించారు.అటవీ ఉత్పత్తుల సేకరణకుగాను గుర్తింపు కార్డులు జారీ చేయాలని అటవీశాఖకు సూచించారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లను ప్రతి 15రోజులకు ఒకసారి వైద్యులు సందర్శించి వైద్యసాయం అందించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఎస్టీలకు సంబంధించి రోస్టర్ అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్, డిప్యూటీ ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మృణాళిని తదితర అధికారులు పాల్గొన్నారు.



చంద్రగిరి కోటలో స్పీకర్

చంద్రగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటను బుధవారం అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సందర్శించారు. సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరిగే జాతీయ మహిళా సాధికారిత సదస్సులో పాల్గొనే కమిటీ సభ్యులు తర్వాత చారిత్రాత్మకమైన చంద్రగిరి కోటను సందర్శించనున్నారు. ఈ క్రమంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జనార్దన్‌రెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, లైటింగ్ షో మేనేజర్ మోహన్ తదితరులతో కలిసి స్పీకర్ కోటను పరిశీలించారు. చంద్రగిరి కోట ప్రాశస్త్యాన్ని తెలిపేలా మ్యూజికల్ లైట్‌షో ఏర్పాటు చేస్తామన్నారు. ఆ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విందు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

→ చంద్రగిరి కోటను సందర్శిస్తున్న స్పీకర్, తుడా చైర్మన్

మత్తు ఇంజక్షన్ వేసుకుంటూ..!

- డ్రోన్‌కు చిక్కిన నలుగురు యువకులు
- కౌన్సెలింగ్ ఇచ్చి తల్లితండ్రులకు అప్పగించిన పోలీసులు



తిరుపతి(నేరవిభాగం), జూలై 23(ఆంధ్రజ్యోతి): చెట్ల పొదల్లో మనల్ని ఎవరు చూస్తారులే అనుకున్నారు. మత్తు ఇంజక్షన్లు వేసుకుంటూ.. మత్తులో మునిగి తేలుతున్నారు. ఇలా తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర నగర్‌లో బుధవారం మత్తు ఇంజక్షన్లు వాడుతున్న నలుగురు యువకులను డ్రోన్ కెమెరాతో నిఘా వుంచి పోలీసులు పట్టుకున్నారు. ఇలాంటి వారిని పట్టుకునేందుకు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. అలా నిఘా ఉంచిన డ్రోన్ కెమెరాకు.. లింగేశ్వరనగర్‌లోని మారుమూల ప్రాంతంలో పొదల మధ్య మత్తు ఇంజెక్షన్లు తీసుకుంటూ నలుగురు యువకులు చిక్కారు. ఎస్పీ నేతృత్వంలోని ఈగల్ టీమ్‌లు, డ్రోన్ కెమెరాల సిబ్బంది గుర్తించారు. వారిని పట్టుకుని తిరుపతి రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ సీఐ చిన్నగోవిందు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. యుక్త వయస్సులో ఇలా చెడు అలవాట్లకు బానిసలుగా మారితే భవిష్యత్ మొత్తం సర్వ నాశనం అవుతుందని హితవు పలికారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించారు. తల్లిదండ్రుల అనుమతితో వారిని వైద్యుల సూచనల మేరకు రీహాబిలిటేషన్ కేంద్రానికి పంపి కౌన్సెలింగ్ ఇప్పిస్తామని చెప్పారు.


బర్డ్ ఆస్పత్రిపై సమీక్షిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో

బర్డ్‌లో అలస్యం లేకుండా
సర్జరీలను పూర్తి చేయండి

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సూచన

తిరుపతి(వైద్యం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని బర్డ్ (బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ద డిజేబుల్)కు వచ్చే రోగులు సర్జరీల కోసం ఎదురు చూడకుండా.. ఆ సమయాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు సూచించారు. తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహంలో బుధవారం ఆయన టీటీడీ ఈవో శ్యామలరావుతో కలిసి బర్డ్ అధికారులతో సమీక్షించారు. అవసరమైన వైద్య పరికరాలు, మందులు, వైద్యులను, సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కీళ్ల మార్పిడి తదితర శస్త్ర చికిత్సలకు అవసరమైన విదేశీ పరికరాలను మరింత నాణ్యమైన వాటిని ఎంపిక చేసుకొని మన ధరలకు అనుగుణంగా సేకరించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చక్కటి గుర్తింపు ఉన్న బర్డ్‌ను గత కొంతకాలంగా నిర్వీర్యం చేయడం బాధాకరమన్నారు. తిరిగి బర్డ్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బర్డ్‌పై నమ్మకంతో వచ్చే రోగుల నమ్మకాన్ని నిలబెట్టేలా వైద్య సేవలు అందించాలని సూచించారు. 'శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలలో చిన్నపిల్లల గుండె శస్త్ర చికిత్సలకు దాతలు విరాళాలు ఇచ్చే అపన్న హృదయ పథకం ఉంది. బర్డ్‌లోనూ అర్హులైన నిరుపేదలకు శస్త్ర చికిత్సలు చేసేందుకు దాతల నుంచి విరాళాలు సేకరించే అంశంపై సంబంధిత అధికారులు సంయుక్తగా నివేదిక తయారు చేయాలి' అని ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. అధునాతన వైద్య పరికరాలను నిబంధనల మేరకు కొనుగోలు చేయాలన్నారు. దివ్యాంగ పిల్లలకు తక్షణమే సర్జరీలను చేస్తున్నామని బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ చెప్పారు. జాయింట్ రీప్లేస్మెంట్‌లకు మాత్రమే ఏడాది సమయం పడుతోందన్నారు. అనంతరం బర్డ్ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, అభివృద్ధి పనులను ఆయన పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు నన్నపనేని సదాశివరావు, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భవనాల నాణ్యతలో రాజీ వద్దు

స్విమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న భవనాల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా చూడాలని అధికారులను టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు ఆదేశించారు. స్విమ్స్‌లో నిర్మిస్తున్న పలు విభాగాలకు సంబంధించిన భవనాలను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను, వైద్య పరికరాలను, సిబ్బందిని త్వరితగతిన పూర్తి చేసి రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందించాలన్నారు. స్విమ్స్ అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యులు సుచిత్ర ఎల్లా, సదాశివరావు, జేఈవో వీరబ్రహ్మం, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, సీఈ సత్యనారాయణ, ఎస్ఈలు మనోహర్, వెంకటేశ్వర్లు, ఎంఎస్ డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

- వరదయ్యపాళెంలో నలుగురు, పనపాకంలో ఇద్దరు
- 20 దుంగలు స్వాధీనం

సత్యవేడు/మంగళం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు చోట్ల మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం జరిపిన తనిఖీల్లో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లు పట్టుబడ్డారు. మొత్తం 20 దుంగలు, మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. వరదయ్యపాళెం ఆర్టీసీ బస్టాండు వద్ద ఎస్ఐ మల్లికార్జున, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. శ్రీకాళహస్తి నుంచి వచ్చిన కారు, మినీ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా 11 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాల్లోని లంక వినోద్, కృష్ణ, పెంచలయ్య, అనిల్‌ను అదుపులో తీసుకున్నారు. దుంగలు, రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి.. నలుగురు స్మగ్లర్లపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపామని ఎస్ఐ తెలిపారు.

పనపాకం వద్ద టాస్క్‌ఫోర్సు తనిఖీలు



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

చంద్రగిరి మండలం పనపాకం సమీపం సి.మల్లవరం క్రాస్ వద్ద జాతీయ రహదారిపై మంగవారం రాత్రి తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ నరేష్ బృందం తనిఖీలు చేపట్టారు. కాస్త దూరంలో ఓ లారీ పక్కకు ఆగింది. అందులో నుంచి ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వీరు కర్ణాటకకు చెందిన వారని గుర్తించారు. లారీలో తనిఖీ చేయగా తొమ్మిది ఎర్రచందనం దుంగలు లభించాయి. దుంగల సహా లారీని, స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తీసుకొస్తున్న ఇద్దరి అరెస్టు

- నాలుగు కిలోలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం భూమయ్యగారి పల్లికి చెందిన గూలూరు చంద్రమోహన్, అదే ప్రాంతానికి చెందిన ఇరసపల్లి అరుణ్‌కుమార్ స్నేహితులు. సులభ సంపాదనకు అలవాటు పడ్డారు. తెలిసిన వారి ద్వారా గంజాయి తీసుకొచ్చి తిరుపతిలో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం వెళ్లారు. శ్రీకాకుళం నుంచి మనోహర్ గంజాయి తీసుకొచ్చి భద్రాచలంలో భారీగా విక్రయిస్తుంటాడు. అతడి వద్ద వీరు రూ.80 వేలకు నాలుగు కిలోల గంజాయి కొన్నారు. రైలులో దిగి తిరుచానూరు రోడ్డు వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. దీనిపై ఈస్ట్ సీఐ శ్రీనివాసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది కలిసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు మనోహర్ కోసం ప్రత్యేక బృందాలను నియమించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

భూ ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు



భూ ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

డక్కిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదని, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెడతామని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సంగనపల్లి చెరువు పోరంబోకు భూములను వైసీపీకి చెందిన ఓ నాయకుడు కబ్జా చేశారంటూ బుధవారం మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సంగనపల్లి గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకుడు 2.5 ఎకరాల చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించి నకిలీ పత్రాలు సృష్టించారని చెప్పారు. దీంతో తహసీల్దార్ సంగనపల్లి వద్దకు వెళ్లి క్షేత్రపరిశీలన చేశారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించి భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం తహసీల్దార్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. వీఆర్వోలు గ్రామాల్లో ఉంటూ ప్రభుత్వ భూములను పరిరక్షించాలని తగు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఆక్రమార్కుల నుంచి భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు.

నరాల సమస్యలపై అవగాహన కలిగిఉండాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంఘమిత్ర

గూడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నరాల సంబంధిత సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యూరాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర అన్నారు. బుధవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన కిమ్స్ ఆస్పత్రి సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి రెండునెలలకోసారి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ వ్యక్తిగత శుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జగదీష్, మోహన సాయిరూప, క్లబ్ సభ్యులు డాక్టర్ చంద్రహాస్, ఎంవీ.రమణయ్య, సోమిశెట్టి చెంచురామయ్య, మురళీరెడ్డి, శీనయ్య, రూపేష్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, రవిచంద్ర, సుగుణమ్మ, నవీన్ జయకుమార్, మెహబూబ్‌బాషా, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో తనిఖీలు

తడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు బుధవారం తనిఖీలు చేశారు. పాఠశాల ల్యాబ్‌లో పరికరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ శ్రద్ధతో చదివి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు భోజనం వడ్డించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో మల్లికార్జునరావు, ఏపీవో భువనేశ్వరి, జీసీడీవో పుష్పలత ఉన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గురవయ్య

గూడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గురవయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పూటుకూరు యామిని, వైస్ ఎంపీపీ ఇంద్రాని, మోహన్, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉనికి కోసం ఆరోపణలు చేస్తే సహించం: టీడీపీ



సమావేశమైన మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కోట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాదరణ కోల్పోయి దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతూ ఉనికిని కాపాడుకునేందుకు అసత్య ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదని టీడీపీ నాయకులు హెచ్చరించారు. కోటలోని టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పలగాని భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌పై వైసీపీ ఇన్‌చార్జి మేరిగ మురళీధర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నియోజకవర్గంలో పాశిం సహకారంతో కోట్లాది రూపాయాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. వైసీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహమ్మద్, కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిరుమశెట్టి కోటేశ్వరరావు, నాయకులు మోహన్ రెడ్డి, మధుయాదవ్, ఎంపీటీసీలు సురేష్, నసంసుద్దీన్, నాయకులు చెంగల్‌రావు, పోలయ్య, వంశీ, రాధాకృష్ణా రెడ్డి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు గురుకుల విద్యార్థులు

కోట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కోటలోని బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులం విద్యార్థులు జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీపోటీల్లో గురుకులం విద్యార్థులు ప్రదీప్ కుమార్, బన్నీ, గౌతమ్ రాజ్, నాగసాయి, లక్ష్మీనారాయణ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 27 నుంచి 29 వరకు మహారాష్ట్రలోని బిలాస్‌పూర్‌లో జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో వీరు పాల్గొంటారు. బుధవారం విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



జాతీయ కుస్తీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ

ఇంటి స్థల విషయమై వివాదం
కత్తితో దాడి ● యువకుడికి తీవ్ర గాయాలు

దొరవారిసత్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థల విషయంలో నెలకొన్న వివాదంలో ఒకరిపై మరొకరు కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండలంలోని తల్లంపాడులో బుధవారం జరిగింది. తల్లంపాడు ఎస్సీ కాలనీలోని చింతపూడి కుమార్, చింతపూడి ఉమామహేష్ మధ్య రెండు రోజులుగా ఇంటి స్థలం విషయంలో వివాదం జరుగుతోంది. బుధవారం వివాదం రేగడంతో ఉమామహేష్ కత్తితో కుమార్‌పై దాడిచేశాడు. మెడ భాగంలో బలమైన గాయం కావడంతో కుమార్‌ను స్థానికులు హుటాహుటిన సూళ్లూరుపేటకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దాడికి పాల్పడిన ఉమామహేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బైక్ నుంచి జారి పడి మహిళకు గాయాలు

దొరవారిసత్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): బైక్‌లో నుంచి జారి పడి మహిళకు గాయాలైన ఘటన దొరవారిసత్రం మండలం పోలిరెడ్డిపాళెం భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా జాతీయ రహదారిపై జరిగింది. గాయపడిన మహిళను స్థానిక టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



పూడేరు వద్ద గ్రావెల్ తవ్వి టిప్పకు నింపుతున్న ఎక్స్‌వేటర్ - అక్రమంగా గ్రావెల్ తరలించడంతో ఏర్పడిన గోతుల్లో చేరిన నీరు

పూడేరులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు
ఆ ప్రాంతం తమ పరిధి కాదంటున్న అటవీ, రెవెన్యూ శాఖలు

నాయుడుపేట టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రావెల్, ఇసుక ఎక్కడుంటే అక్కడ అక్రమార్కులు వాలిపోతున్నారు. నాయుడుపేట మండలంలోని పూడేరులో నివాసాలకు సమీపంలో ఉన్న భూముల్లో నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. నాయుడుపేట మండలం పూడేరు గ్రామానికి సమీపంలోనే గిరిజన కాలనీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఎక్స్‌కవేటర్ల సాయంతో గ్రావెల్ తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. గ్రావెల్ తవ్వకంతో భారీగా గుంతలు ఏర్పడి వర్షానికి నీళ్లు చేరుతున్నాయి. పాఠశాల విద్యార్థులు, కాలనీలో నివాసం ఉంటున్న చిన్నారులు సరదాగా ఆడుకునేందుకు వెళుతుంటారు. ఆ సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అక్రమ గ్రావెల్ తవ్వకం గురించి అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆ ప్రాంతం తమ పరిధిలోనిది కాదని ఇరుశాఖల అధికారులు చెబుతున్నారు. దీంతో అడిగేవారే లేరని గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని పూడేరు గ్రామస్తులు కోరుతున్నారు.

ఇరకంకుప్పంవాసులకు ఇళ్ల పట్టాల పంపిణీకి సన్నాహాలు

తడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇరకంకుప్పం గ్రామస్తుల కష్టాలు తొందరలో తీరిపోనున్నాయి. వారికి పూడికుప్పంలో స్థిర నివాసం ఏర్పాటుకు అవసరమైన స్థలాల కేటాయింపునకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇరకందీవివాసులకు కనీస అవసరాలు లేకపోవడంతో ఆ పంచాయతీ పరిధిలోని పూడికుప్పానికి వలస వచ్చేందుకు నిర్ణయించుకున్నారు. తమకు పూడికుప్పంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ గత ఐదేళ్లగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై ప్రస్తుత ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఇళ్ల పట్టాల పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఒక్కొక్క కుటుంబానికి 2 సెంట్ల చొప్పున 210 కుటుంబాలకు పూడికుప్పంలో స్థలాలు కేటాయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నారు. బుధవారం ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు మత్స్యకార నాయకులు, ఇరకం, పూడికుప్పం గ్రామస్తులు కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలుసుకుని ఇళ్ల స్థలాలు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరు కావాల్సినదిగా కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మన్ పళణి, బొమ్మన్ శ్రీధర్, సుధాకర్, శివాజీ, వాసు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

కొరిడి-పేర్నాడు తారురోడ్డు నిర్మాణానికి కృషి

తడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని కొరిడి - పేర్నాడు రోడ్డు నిర్మాణానికి అవసరమైన అనుమతుల మంజూరుకు కృషి చేస్తామని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ నెలవల విజయశ్రీకి హామీ ఇచ్చారు. బుధవారం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా కొరిడి - పేర్నాడు రోడ్డు అటవీ, వన్యప్రాణి పరిధిలో ఉన్నందున అనుమతుల మంజూరు విషయంలో జాప్యం జరుగుతోందని, తారురోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పక్షుల పండుగలో పడవల ఏర్పాటు చేసినందుకు మత్స్యకారులకు ఇవ్వాల్సిన బకాయిలు మంజూరు చేయాలని కోరారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరలోనే అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే పడవల బకాయిలను త్వరలోనే చెల్లిస్తామన్నారు.

రెజాంగ్ లా రాజ్ కలశ యాత్రకు స్వాగతం



పెళ్లకూరులో స్వాగతం పలుకుతున్న మాజీ ఎంపీ నెలవల

సూళ్లూరుపేట, దొరవారిసత్రం, పెళ్లకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో అహీర్(యాదవ) రెజిమెంట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహిస్తున్న రెజాంగ్ లా రాజ్ కలశ యాత్ర బుధవారం సూళ్లూరుపేటకు చేరింది. ఏప్రిల్ 13న బిహార్‌లో అఖిల భారత యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ సోమప్రకాష్ ఆధ్వర్యంలోని ప్రారంభమైన ఈ యాత్రకు సూళ్లూరుపేట జాతీయ రహదారిపై హోలీక్రాస్ వద్ద యాదవ సంక్షేమ సంఘ నాయకులు రమణయ్య, జెట్టి వేణుయాదవ్, మెళ్లకంట శ్రీనివాసులు, డాక్టర్ మునస్వామి, మోహన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సోమప్రకాష్ మాట్లాడుతూ 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో 120మంది అహీర్ వీరసైనికులు పోరాటం చేసి లడక్ చుగుల్ ఫైర్ ఫీల్డును కాపాడారన్నారు. ఈ యుద్ధంలో 114మంది అహీర్ వీరులు (యాదవ) వీర మరణం పొందినట్లు వివరించారు. యాదవ వీరుల జ్ఞాపకార్థం అహీర్ రెజిమెంట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే రెజాంగ్ లా రాజ్ కలశ యాత్రకు దొరవారిసత్రంలో స్థానిక యాదవ నాయకులు సగిలాల రమణయ్య, విజయకుమార్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు గ్రామం వద్ద మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు నంది కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.

ప్రభుత్వ భూముల్లోకి వెళ్లరాదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు

తడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన పోరంబోకు భూముల్లోకి ఎవరూ ప్రవేశించరాదని, అక్కడ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వలేదని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. సదరు భూముల్లో గుడి నిర్మాణం జరిగిందని, అందులో క్షుద్రపూజలు జరుగుతున్నాయంటూ ఆదివారం కొండూరు గ్రామస్తులు ఆలయాన్ని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు విచారణ జరిపారు. సదరు భూమి ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించారు. ఆ భూముల్లోకి ఎవరూ వెళ్లరాదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం



దొరవారిసత్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం ఎన్ఎం అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి కారు దగ్ధమైంది. సూళ్లూరుపేట మండలం సుద్ధమడుగు తాగేలి నుంచి నాయుడుపేటకు వెళ్తున్న స్కార్పియో కారులో ఎన్ఎం అగ్రహారం వద్ద మంటలు చెలరేగాయి. కారులో ఉన్న విజయశేఖర్‌రెడ్డి అప్రమత్తమై రహదారి పక్కన ఆపేసి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది.

ద్విచక్ర వాహనానికి నిప్పు

వెంకటగిరి టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలిశెట్టి గుంట వద్ద మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టారు. బాధితుడు అబ్దుల్ అజీజ్ తెలిపిన వివరాలు... ప్రతిరోజూ లాగే మంగళవారం రాత్రి ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి వాహనం మంటల్లో కాలిపోతుండడంతో చుట్టుపక్కల స్థానికులు గమనించి అజీజ్‌ను నిద్రలేపారు. అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

వెలుగు సీసీకి సన్మానం

చిట్టమూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల వెలుగు సీసీగా పనిచేసిస్తూ పదవీ విరమణ పొందిన రెడ్డెమ్మను బుధవారం సత్కరించారు. స్థానిక స్త్రీ సంక్షేమ భవనంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు పూలమాలలు, శాలువాలతో రెడ్డెమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గున్నయ్య, సీసీలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

సూళ్లూరుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అత్తిరాల కిరణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కరపత్రాలు అందజేసి వివరించారు. ప్రజల సమస్యలను డిగి తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బెజవాడ విజయమ్మ, నియోజకవర్గ నాయకులు తాడిపర్తి ఆదినారాయణ రెడ్డి, బీజేపీ నాయకులు నూతలపాటి శ్రీనివాసులు, సుజన్ రావు, దుర్గి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

కోట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కోటలోని బాలసదనంలో చిన్నారులకు బుధవారం తిరుపతి రుయా ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలసదనం ఇన్‌చార్జి సూపరింటెండ్ మునికుమారి ఆధ్వర్యంలో రుయా వైద్యాధికారులు డాక్టర్ గుణశేఖర్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ శ్రీనివాసులు చిన్నారులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గూడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలను పెంచడం వల్ల కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీకాంత్, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం తగదు

గూడూరు అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తాను ఎవరినీ అసభ్య పదజాలంతో దూషించలేదని, సీఐటీయూ నాయకులు తనపై అసత్య ఆరోపణలు చేయడం తగదని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తుండడంతో ఎక్కడా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నామన్నారు. తాను ఎవరినీ దూషించలేదని, తప్పుచేశానని తేలితే శాఖాపరమైన చర్యలు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు.

పీ-4 కార్యక్రమంపై అవగాహన

గూడూరు అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 19వ సచివాలయంలో బుధవారం పీ-4 కార్యక్రమం అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్ కుమార్ మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలించేందుకు సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో సుధీర్, రమేష్‌కుమార్, సుధాకర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

గూడూరు అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆస్పత్రి రోడ్డులో మంగళవారం రాత్రి ఓ యువకుడిపై దాడి చేశారని బుధవారం ఒకటో పట్టణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఒకటో పట్టణ ఎస్ఐ తిరుపతయ్య వివరాల మేరకు... స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ పానీపూరి దుకాణం వద్ద పట్టణానికి చెందిన రాకేష్‌తో మరో ఇద్దరు యువకులకు మధ్య స్వల్పవివాదం జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు యువకులూ కలిసి రాకేష్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొడ్డేరువాగులో పడి వ్యక్తి మృతి

వెంకటగిరి టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూలశాలివీధికి చెందిన దొంతు మునెయ్య(50) చింతగుంట వద్ద ఉన్న గొడ్డేరు వాగులో పడి మృతి చెందాడు. ఎస్ఐ ఏడుకొండలు కథనం మేరకు... మంగళవారం సాయంత్రం కుటుంబంలో చిన్నపాటి గొడవ జరగడంతో మునెయ్య ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన స్థానికులు చింతగుంట వద్ద ఉన్న గొడ్డేరువాగులో మునెయ్య మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఏడుకొండలు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించండి

వెంకటగిరి టౌన్, డక్కిలి, జులై 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీవీ.రమణయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి కూలీలు, ఉపాధి సిబ్బందితో కలిసి నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రోజూ కూలి పనులు చేసుకుని జీవనం సాగించే వారికి రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రెండు నెలలుగా ఉపాధి బిల్లులు ఖాతాల్లో పడకపోవడంతో కూలీలు ఇతర పనులకుపోవాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. ఉపాధి పథకంలో వ్యవసాయ భూముల అభివృద్ధి, పంట కాలువలు పూడికతీత, మరమ్మతు పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవోకు కృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం సభ్యుడు భాస్కర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. అలాగే డక్కిలి మండల పరిషత్ కార్యాలయ అధికారులకు రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీలకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

స్పీకర్, డిప్యూటీ స్పీకర్లను కలిసిన విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కలిశారు. బుధవారం తిరుపతిలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన స్పీకర్, డిప్యూటీ స్పీకర్లను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.



స్పీకర్ అయ్యన్న పాత్రుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

జాతీయ రహదారి పక్కన చెట్ల నరికివేతపై ఫిర్యాదు

తడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పూడికుప్పం జాతీయ రహదారి పక్కన భారీ వృక్షాలను కొందరు వ్యక్తులు నరికివేశారంటూ జాతీయ రహదారి అధికారులు పోలీసులకు, తహసీల్దారుకు బుధవారం ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే చెట్లను నరికివేశారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాలగంగాధర్ తిలక్ జయంతి

చిల్లకూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వాతంత్ర సమర యోధుడు బాలగంగాధర్ తిలక్ జయంతి నిర్వహించారు. తిలక్ చిత్రపటానికి పూలమాల వేసినివాళు లర్పించారు. తిలక్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అనసూయ, లావణ్య, ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, చంద్రశేఖర్, లీల, మధుసూదనరావు, నాగభూషణమ్మ, కామేశ్వరి, సుగుణమ్మ, రమణయ్య, సంధ్య, విద్యుల్లత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి ఆర్థిక సాయం

గూడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు వినోద్‌కు పండరీ భజనకారుల ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. వినోద్ ఇటీవల రైలు ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం పండరీభజన కళాకారుల ఆధ్వర్యంలో రూ.1.25 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కృష్ణదాసు, పెంచలరెడ్డి, పెంచలదాసు, ప్రభాకర్, శ్రీకాంత్, లక్ష్మయ్య, మురళి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.